MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 23 సంచిక: 6 రంగారెడ్డి ఫిబ్రవరి 2025 పేజీలు : 36 వెల : రూ. 10/-

## భారత్ గ్రామీణ్ మహోత్సవం!



ఢిల్లీలో ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ ప్రారంభించిన 'భారత్ గ్రామీణ్ మహోత్సవం' లో శ్రీ సి ఎస్ రెడ్డి, శ్రీ మోహనయ్య పాల్గొన్న దృశ్యాలు




హైదరాబాద్‌లోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో సుభాష్ పాలేకర్ కృషి (ఎస్ పి కె) సదస్సు దృశ్యాలు

## సేవారంగంలో అద్వితీయంగా అర్ధశతాబ్ది !



అనంతపురంలో యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ మల్లారెడ్డి అభివృద్ధి సేవా రంగంలో అర్ధశతాబ్ది వేడుక దృశ్యాలు



హైదరాబాద్‌లో విప్రో భాగస్వామ్య సంస్థల ప్రతినిధుల మహా సమ్మేళనం !



బతుకుదెరువు చూపిన
**బేడీ** కన్నుమూత


నాబార్డ్ సౌజన్యంతో ....

NABARD

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఓ)

సహకారమే పునాదిగా సంఘాల బలోపేతం
సేవలే ఆధారంగా ప్రగతి దిశలో రైతుల పయనం

## చేపట్టే పనులు




NABARD

# మహిళా సాధికారత


సంపుటి 23 సంచిక 6



సంపాదకీయం

## కొత్త బడ్జెట్ !

**కొ**త్త సంవత్సరం కంటె కూడా, కొత్త బడ్జెట్ కోసం ఎదురు చూసేవారు చాలా మందే వుంటారు. ఎందుకంటె, సంవత్సరంలో కొత్తదనం ఊహాజనితం. కేవలం నమ్మకం. కాని బడ్జెట్ ... ఎందరి తల రాతలనో సానుకూలంగానో, ప్రతికూలంగానో మార్చగల శక్తిమంతమైన ప్రత్యక్ష ప్రక్రియ . కేవలం నమ్మకం కాదు. కాదనలేని నిజం! ఉదాహరణకు 2025-26 సంవత్సరానికి సంబంధించి, శ్రీమతి నిర్మలా సీతారామన్ సమర్పించిన బడ్జెట్‌నే తీసుకుంటే, ఒక్క కలంపోటుతో, ఒక్క ప్రతిపాదనతో కోటి మందికి పైగా వేతన జీవులకు ఆదాయంపన్ను చెల్లింపులో భారీ ఊరట లభిస్తున్నది.అదీ బడ్జెట్ మహిమ! ఇక వ్యవసాయ, అనుబంధ రంగాలకు కూడా అనేక ప్రోత్సాహాలను ఈ బడ్జెట్ అందిస్తున్నది. వ్యవసాయ రంగానికి సంబంధించి తొమ్మిది భారీ కార్యాచరణ ప్రణాళికలను (మిషన్‌లను) ఈ బడ్జెట్ ప్రతిపాదిస్తున్నది. వీటిలో ఒకటి బీహార్ రాష్ట్రానికి (మఖానా బోర్డ్) , మరొకటి అస్సాం రాష్ట్రానికి, (యూరియా ప్లాంట్) మాత్రమే పరిమితమైనవి , ఇంకొకటి తక్కువ ఉత్పాదక స్థాయి కలిగిన 100 జిల్లాలకు (ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన), వేరొకటి ప్రధానంగా అండమాన్, నికోబార్, లక్షద్వీప్‌లపై దృష్టి కేంద్రీకరించేది (ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన). కాగా, మిగిలిన ఐదు పథకాలు దేశమంతటికీ వర్తించేవే. వీటిలో కంది, మినుము వంటి కాయ ధాన్యాల పంటలను ప్రోత్సహించే ఉద్దేశంతో 'కాయధాన్యాల ఆత్మ నిర్భర మిషన్' పేరుతో కేవలం వచ్చే ఆర్థిక సంవత్సరానికే వెయ్యి కోట్లరూపాయలు కేటాయిస్తున్నారు. ఇది ఆరేళ్ళపాటు కొనసాగుతుందని, ఈ పంటలను ఎంత ఎక్కువగా పండిస్తే అంతా కొనుగోలు చేస్తామని బడ్జెట్ ప్రతిపాదన హామీ యిస్తున్నది. అందువల్ల, మెట్ట భూముల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. మరొక ఆసక్తికరమైన పథకం కూరగాయలు, పండ్ల సాగును ప్రోత్సహించడానికి ఉద్దేశించినది. రైతులకు గిట్టుబాటు ధరల కల్పనతోపాటు, కాయగూరలను, పండ్లను విలువపెంపు ఉత్పత్తులుగా ప్రాసెసింగ్ చేసే సదవకాశాలను కూడా ఈ మిషన్ కల్పిస్తుంది. చీడపీడల, ప్రతికూల వాతావరణ దుష్ప్రభావాల బెడదలేని నాణ్యమైన అధిక దిగుబడి పంటల సాగును ప్రోత్సహించడంకోసం 'జాతీయ అధిక దిగుబడి విత్తన ఉత్పత్తి మిషన్' పేరుతో 100 రకాల మేలుజాతి విత్తనాలను రైతులకు వాణిజ్యపరంగా అందుబాటులోకి తేవాలన్న సంకల్పం ఎంతైనా అభినందనీయం. దిగుబడులు పెరగడంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తులు మరింత నాణ్యంగా వుంటాయి కాబట్టి రైతులు మరింత ఆదాయాన్ని ఆశించవచ్చు. మరో కీలకమైన బడ్జెట్ ప్రకటన వ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళలను, యువరైతులను, చిన్న రైతులు, భూమిలేని పేదల కుటుంబాలకు చేయూత యివ్వడానికి ఉద్దేశించిన 'గ్రామీణ సుసంపన్న, ప్రతికూలతా అధిగమన కార్యక్రమం'. ఈ కుటుంబాలవారిలో నైపుణ్యాల పెంపుదలకు, పెట్టుబడులు సమకూర్చడానికి, సాంకేతికతను జోడించడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుంది. సంపద సృష్టికి, నైపుణ్యాల పెంపుదలకు ఉద్దేశించిన ఈ కార్యక్రమం ఆశించిన విధంగా అమలు జరిగితే గ్రామాల రూపురేఖలే ఎంతో మెరుగుగా మారిపోతాయనడంలో సందేహంలేదు. పొడవు గింజ ప్రత్తి ఉత్పాదకతను, మన్నికను పెంపొందించడంకోసం సంకల్పించిన 'ప్రత్తి ఉత్పాదకత మిషన్' ప్రత్తి రైతులలో ఆశలను రేకెత్తిస్తుంది. ఇంతే కాకుండా వ్యవసాయంలో యాంత్రీకరణకు కూడా ఈ బడ్జెట్ తగిన ప్రాధాన్యం యిస్తున్నది. ముఖ్యంగా సాగుబడిలో డ్రోన్‌ల వినియోగాన్ని పెంచడానికి దోహదపడే ధోరణి కనిపిస్తుంది. ఇప్పుడిప్పుడే మన రైతులు పంటలపై పురుగు మందులను, ద్రావణాలను చల్లడానికి డ్రోన్‌లను వినియోగించడానికి అలవాటు పడుతున్నారు. భవిష్యత్తులో కృత్రిమ మేధ తోడ్పాటుతో డ్రోన్‌ల వినియోగం మరింతగా విస్తరించే అవకాశాలు ఎంతైనా వున్నాయి. ఈ అంశాలనన్నిటిని దృష్టిలో వుంచుకుని, ఎఫ్ పి ఓల పాలకవర్గాలు, కార్యనిర్వహణాధికారులు అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి కేంద్రీకరించడం అవసరం. వారికి కావలసిన చేయూత అందించడానికి, అవగాహనను పెంపొందించడానికి ఏపిమాస్ సంతోషంతో సర్వదా సంసిద్ధంగా వుంటుంది.



**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**

అనుబంధం అంటే ఒకరిపట్ల ఒకరికి వుండే ఆత్మీయతే కాని, దీర్ఘకాల పరిచయమో, ఇచ్చిపుచ్చుకోడమో కాదు

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

**ఎడిటోరియల్ కమిటి: ఎన్ వినాయక రెడ్డి, ఎల్. భవాని, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మచారి, ఎస్. ప్రహ్లాదయ్య**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి , సాంకేతిక సహకారం: బి మౌళి**

## లోపలి పేజీలలో ....

- సవాళ్ళకు సవాలువిసిరే గ్రామీణ భారతం 05
- 'ప్యాక్స్‌లలో సమూల సంస్కరణలు అవసరం' 06
- 50 సంవత్సరాలలో స్వచ్ఛంద సంస్థల వికాసం! 07
- గో ఆధారిత వ్యవసాయమే పరిష్కారం ... 08
- 'ఉపాధి హామీ' ఉద్యమనేత బేడీ కన్నుమూత! 11
- అవగాహనను అందించిన 'విప్రోకేర్స్'సమ్మేళనం 12
- పుట్టగొడుగుల పెంపకంపై బీహార్ ఎఫ్‌పిసికి శిక్షణ 14
- సీమ నీటిప్రాజెక్ట్‌పై భాగస్వామ్య బృందం సమీక్ష 15
- కొత్త పద్ధతులతో కుండల తయారీ శిక్షణ ! 16
- 'ఫిష్ ఆంధ్ర' హేమలతకు రాష్ట్రపతి గుర్తింపు! 18
- పారిశుధ్యం జయమ్మకు రాష్ట్రపతి ఆహ్వానం! 19
- నాడు వ్యవసాయ కూలీ ...నేడు సంస్థ అధిపతి 21
- మార్పులు తెచ్చిన పట్టణ పోషణ పథకం! 23
- సేంద్రియ వ్యవసాయ టమాటపంట క్యాలెండర్ 24
- పట్టణాల్లో ఉన్న ఆస్తులు తనఖా పెడితేనే రుణం 27
- నాగాలాండ్‌లో ఏపిమాస్ బృందం శిక్షణ 28
- వాటర్‌ఆర్గ్ ప్రతినిధి మెదక్ ప్రాజెక్ట్ సందర్శన 29
- తిరుపతిలో పాలేకర్ వ్యవసాయ శిక్షణ శిబిరం 30
- 17 ఏళ్లకే 7పర్వతాలను అధిరోహించిన కామ్య 32
- పది నిమిషాల్లో ఎకరం పని పూర్తి ! 34

## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

**'మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడంకోసం 'మహిళా సాధికారత 'పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

సానుకూల వైఖరి అంటే కేవలం ఆశాభావమే కాదు, జరిగేదంతా మంచికే అనే వివేచన

# సవాళ్ళకు సవాలు విసిరే గ్రామీణ భారతం: ప్రధాని మోదీ

ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ జనవరి 4న న్యూఢిల్లీ లోని భారత్ మండపంలో 'భారత్ గ్రామీణ్ మహోత్సవ్ -2025'ను ప్రారంభించారు. ఆరు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమాన్ని 'వికసిత భారత్ - 2047 లక్ష్యంగా సవాళ్ళను అధిగమించే పటిష్ఠ గ్రామీణ భారతదేశాన్ని నిర్మించడం', 'గ్రామీణ భారత సాంస్కృతిక వారసత్వానికి పునరంకితం కావడం' అనే ఆశయాలతో నిర్వహించారు.

గ్రామాలను చైతన్యవంతమైన వృద్ధి కేంద్రాలుగా మార్చడం ద్వారా గ్రామీణ భారతదేశాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రధాని మోదీ తన ప్రసంగంలో వివరించారు. పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం, వైద్యం, గృహవసతి వంటి నిత్యావసర సేవలు అందుబాటులో ఉండేలా ప్రతి గ్రామంలో కనీస సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

స్వచ్ఛ భారత్ మిషన్, పీఎం ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్ వంటి కార్యక్రమాల కింద లక్షలాది గ్రామీణ కుటుంబాలు మరుగుదొడ్లు, గృహాలు , స్వచ్ఛమైన తాగునీటిని పొందగలిగాయని, ఆయుష్మాన్ ఆరోగ్య సదనాల ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలను గ్రామాలకు విస్తరించడం, టెలిమెడిసిన్ ద్వారా గ్రామీణులను అగ్రశ్రేణి వైద్యులతో అనుసంధానించడాన్ని శ్రీ మోదీ గుర్తుచేశారు.

రైతులకు ఆర్థిక సహాయం అందించడానికి ఉద్దేశించిన పిఎం కిసాన్ సమ్మాన్ నిధి, వ్యవసాయ రుణాలను విస్తరించడం, పశువుల,చేపల పెంపకందారులకు తోడ్పాటు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్‌పిఓలు) ప్రోత్సహించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన ప్రధానంగా పేర్కొన్నారు.

భారతదేశ గ్రామీణాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకంగా మారుతున్నదనేది ప్రధాని మోదీ ప్రసంగంలోని ముఖ్యాంశాలలో ఒకటి. 2021లో సహకార మంత్రిత్వశాఖ ఏర్పాటును ఆయన ప్రశంసించారు రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన విలువను అందించడానికి దాదాపు 70,000 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను (పి ఎ సి ఎస్) కంప్యూటరీకరించేందుకు జరుగుతున్న కృషిని ఆయన వివరించారు.

గ్రామీణాభివృద్ధిలో మహిళల పాత్రను శ్రీ మోదీ ప్రశంసించారు, ఇప్పుడు చాలా మంది మహిళలు స్వయం సహాయ సంఘాలకు నాయకత్వం వహిస్తున్నారని, 'లఖ్‌పతి దీదీ'ల వంటి పథకాల ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పొందుతున్నారని ఆయన అన్నారు. అయినా, సవాళ్ళు కొనసాగుతూనే ఉన్నాయని, సుస్థిరాభివృద్ధిదాయక, సమ్మిళిత వ్యూహాల ద్వారా గ్రామీణ భారతదేశ ఆర్థిక సామర్థ్యాన్ని మరింతగా పెంపొందించడానికి తమ ప్రభుత్వం సర్వవిధాల కృషిచేస్తున్నదని ప్రధాని పేర్కొన్నారు.

**భాగస్వామ్యాలు**

ఈ ప్రతిష్టాత్మక లక్ష్యాలను సాధించడానికి, ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ సంస్థలు , పౌర సమాజంతో కూడిన బహుముఖ విధానం అవసరమని, గ్రామీణాభివృద్ధిలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలు (పి పి పి ఎస్) ఆధునిక సాంకేతికతకు, సమర్థమైన నిర్వహణకు దోహదంచేస్తాయని ప్రధాని అన్నారు.

ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన, పీఎం ముద్ర, పీఎం స్వానిధి సహా 16 ప్రభుత్వ పథకాలను బ్యాంకులద్వారా ముమ్మరంగా అందిస్తున్నట్టు తెలిపారు.

మహోత్సవ్‌లో వివిధ చర్చలు, వర్క్ షాప్‌లు, మాస్టర్ క్లాస్‌ల ద్వారా గ్రామీణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, స్వావలంబిత ఆర్థిక వ్యవస్థల సృష్టి, గ్రామీణ ఆవిష్కరణల ప్రోత్సాహాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆమె పేర్కొన్నారు.

■


నిగూఢ అవకాశాలను చూసే దార్శనికత, అసాధ్యాలను సాధించే తపన వుంటే గెలుపు మీదే

# 'ప్యాక్స్‌లలో సమూల సంస్కరణలు అవసరం'

జనవరి 4న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆరు రోజుల పాటు జరిగిన 'భారత్ గ్రామీణ్ మహోత్సవ్ –2025' లో 'వికసిత భారత్ స్వప్న సాకారానికి సహకార సంస్థలకు సాధికారత కల్పన' అనే అంశంపై జరిగిన చర్చా గోష్ఠిలో ప్యానలిస్టులుగా (గోష్ఠి బృందంలో విషయ నైపుణ్య సభ్యులుగా) ఏపిమాస్ సి ఇ ఓ, ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి, పాలకవర్గం సభ్యులు శ్రీ మోహనయ్య పాల్గొన్నారు.

**ప్యాక్స్‌ల బలోపేతంతోనే సహకార రంగ ప్రగతి మోహనయ్య**

శ్రీ మోహనయ్య ప్రసంగిస్తూ, సహకార రంగంపట్ల తనకున్న విడదీయలేని మక్కువను, అనుబంధాన్ని వివరిస్తూ, 'భారత్ గ్రామీణ మహోత్సవ' నిర్వహణ సంకల్పాన్ని,



నిర్వహిస్తున్న తీరును కొనియాడారు. ఇంత చక్కని కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించాలని ఆయన కోరారు. సహకార రంగంలో ఆశించే అభివృద్ధి మొదటి మెట్టు నుంచి మొదలు కావాలని, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (ప్యాక్స్)ను బలోపేతం చేయకుండా ప్రగతి సాధ్యంకాదని శ్రీ మోహనయ్య అన్నారు.


వివిధ కారణాల వల్ల ప్యాక్స్‌లు ఒకనాటి వైభవాన్ని కోల్పోయి, ఎంతో దుస్థితిలో కునారిల్లుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంస్థలలో మానవ వనరుల కొరత చాలా తీవ్రంగా వుందని, సంఖ్యా పరంగా వివిధ బ్యాంకుల శాఖలతో సమాన స్థాయిలో ప్యాక్స్‌లు వున్నప్పటికి, వ్యవసాయ రంగానికి రుణాలు సమకూర్చడంలో ఒకనాటి 80–90 శాతం మార్కెట్ వాటా నుంచి, నేడు 15 శాతాని కంటె తక్కువకు పడిపోయిందని ఆయన పేర్కొన్నారు.

**ప్యాక్స్‌లు బహుళ సేవా సంస్థలుగా మారాలి : సి ఎస్**

ప్యాక్స్‌లు తిరిగి పూర్వవైభవాన్ని పొందాలంటే, అవి కేవలం రుణసేవలకే పరిమితం కాకుండా, సభ్య రైతులకు అవసరమైన వివిధ సేవలను అందించే బహుళార్ధదాయక సంస్థలుగా రూపొందాలని ఏపిమాస్ సి ఇ ఓ, ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి పేర్కొన్నారు.

ప్యాక్స్‌ల రూపకల్పనలో వున్న ఒక ప్రధాన లోపాన్ని ఆయన ప్రస్తావిస్తూ, ప్యాక్స్‌లలో మహిళలకు తగిన పాత్ర లేకపోవడం విచారకరమని అన్నారు. వాటాదారులుగా, పాలకవర్గ సభ్యులుగా, లబ్ధి దారులుగా మహిళలకు తగిన ప్రాతినిధ్యం, ప్రాధాన్యం లభించాలని ఆయన ఆకాంక్షించారు.

ఏపిమాస్ 23 ఏళ్ళుగా స్వయంసహాయ సంఘాలు, సమాఖ్యలతో, సామాజిక సంస్థలతో, 10 సంవత్సరాలుగా ఎఫ్ పి ఓలతో కలసి పని చేస్తున్న అనుభవం ఏపిమాస్‌కు



వున్నదని, శ్రీ సి ఎస్ రెడ్డి పేర్కొంటూ, ఏపిమాస్ స్వయంగా 86 ఎఫ్ పి ఓలను ప్రోత్సహిస్తున్నదని, మొత్తం 250 ఎఫ్ పి ఓలతో కలసి పని చేస్తున్నదని, వీటిలో 22 ఎఫ్ పి ఓలు నూటికినూరు శాతం మహిళా వాటాదార్లతో, మహిళా పాలకవర్గంతో, మహిళా సభ్య రైతులతో నడుస్తున్నవేనని, మిగిలిన ఎఫ్ పి ఓలలో కూడా మహిళలకు సముచిత ప్రాధాన్యానికి ఏపిమాస్ కృషి చేస్తున్నదని చెప్పారు.

ప్యాక్స్‌లు బహుళ సేవల సంస్థలుగా రూపొందడానికి ముందుగా ఆ వ్యవస్థలో వున్న బలహీనతలను సవరించాలని, తాము వాటాదారులమన్న విషయమే చాలామంది సభ్య రైతులకు తెలియదని, సభ్య రైతులకు సంబంధించిన సమాచారం కాని, వారు ఏఏ పంటలు పండిస్తున్నారో, యితర అవసరమైన ఏ సమాచారమూ ప్యాక్స్‌లలో లభించడం లేదని, ముందుగా ప్యాక్స్‌ల వాటాదార్ల, పాలకవర్గాల ఆలోచనా ధోరణిలో మార్పు రానిదే ప్యాక్స్‌లలో ప్రగతి సాధ్యం కాదని శ్రీ సి ఎస్ రెడ్డి స్పష్టీకరించారు. ■

# 50 సంవత్సరాలలో స్వచ్ఛంద సంస్థల పరిణామ వికాసం!

## డాక్టర్. వై.వి. మల్లారెడ్డి అర్ధశతాబ్ది విశిష్ట సేవా ప్రస్థాన మహోత్సవం!

**– సి. గోపాలరాజు**

**అ**ర్ధశతాబ్దం పైగా వ్యవసాయ రంగానికి, గ్రామీణాభి వృద్ధికి, పేదరికాన్ని తగ్గించడానికి విశేష సేవలు అందిస్తున్న ఏ. యఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్. వై.వి. మల్లారెడ్డి సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని, అనంతపురంలోని 'యాక్షన్ ఫ్రటర్నా ఎకాలజీ సెంటర్ ' ఆత్మీయ పలకరింపులు, అభినందన వెల్లువలు, చర్చా గోష్ఠులు, సన్మాన కార్యక్రమాలతో పులకరించి పోయింది.

ఆ రోజు ఉదయం 11:00 నుండి సాయంత్రం 5:00 వరకు 1970 నుండి 2020 సంవత్సరాల కాలంలో (50 సంవత్సరాలలో) స్వచ్ఛంద సంస్థల పరిణామ వికాసంపై కార్యశాలను (వర్క్ షాప్‌ను) ఎకాలజీ సెంటర్ వారు నిర్వహించారు. ఈ వర్క్‌షాపుకు 36 స్వచ్ఛంధ సంస్థల నుండి 62 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఏపిమాస్ సి ఇ ఓ, ఎండి శ్రీ సి.యస్.రెడ్డి సౌలభ్యకర్తగా, శ్రీమతి ఏ.కళామణి సహ సౌలభ్యకర్తగా వ్యవహరించి కార్యక్రమాన్ని రక్తికట్టించారు.

డా. మల్లారెడ్డి 1974 సంవత్సరం నుండి ఆర్.డి.టి.లో వ్యవసాయ సాంకేతిక సలహాదారుగా, ఏ.యఫ్. ఎకాలజీ సెంటర్ డైరెక్టర్‌గా (50 సంవత్సరాలకు పైగా) పని చేస్తూ, ఈ నాటికీ కరువుసీమలో వ్యవసాయ సేవలు అందిస్తున్న విషయమై వక్తలు అందరూ డా. మల్లారెడ్డి సేవలను ఎంతగానో కొనియాడారు.

**వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతినిధులు ముఖ్యంగా ఈ క్రింది అంశాలపై చర్చించారు:**

- భారతదేశ ప్రగతి గమనంలో 1970 నుండి 2020 వరకు 50 ఏళ్ళపాటు ప్రభుత్వేతర అభివృద్ధిరంగ స్వచ్ఛంద సంస్థలు (ఎన్ జి డి ఓలు) చెందిన పరిణామ క్రమ విశ్లేషణ
- 2047 నాటికి మనదేశం 'వికసిత భారత్'గా సమగ్రాభివృద్ధి సాధించే ప్రస్థానంలో ఎన్ జి డి ఓలు నిర్వహించవలసిన పాత్ర ఏమిటో పరిశీలించడం
- డాక్టర్ మల్లారెడ్డి చేసిన అశేష విశేష సామాజిక సేవను సమీక్షించడం

**నాలుగు సమాంతర చర్చా గోష్ఠులు**

మధ్యాహ్న భోజనానంతరం ప్రతినిధులందరు నాలుగు జట్లుగా విడిపోయి ...

- యన్ జి. ఓ. లు ఇప్పటివరకు అందించిన సేవల ద్వారా నేర్చుకున్న అంశాలు ఏమిటి?
- రాబోవు 22 సంవత్సరాలలో (2047 నాటికి... వికసిత్ భారత్) యన్ జి.ఓ.ల పాత్ర అనే ఆంశాలపై సమాంతర చర్చా వేదికలు నిర్వహించుకొని పోస్టర్ల ద్వారా బహిరంగ ప్రదర్శన చేశారు.

సాయత్రం జరిగిన డాక్టర్ వై వి మల్లారెడ్డి అర్ధశతాబ్ది సామాజిక సేవా అభినందన సభకు ఈ వర్క్ షాప్‌కు వచ్చిన ప్రతినిధులు, ఏ.యఫ్. ఎకాలజీ సెంటర్ ప్రాజెక్ట్ ఏరియా భాగస్వామ్య రైతు సంస్థల సభ్యులు మొత్తం 400 మంది హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి ఆర్.డి.టి. చైర్ పర్సన్ శ్రీమతి అనీ ఫెరర్, ఆర్. డి. టి. డైరెక్టర్ శ్రీ మాంచో ఫెరర్ శ్రీమతి విశాల ఫెరర్, ఈనాడు యండి. శ్రీ నాగరాజు, ఏపీమాస్ యండి శ్రీ. సి. యస్. రెడ్డి, బి. యఫ్. టి. డబ్ల్యూ జర్మనీ ప్రతినిధి శ్రీ పీటర్, పాండస్ వేధికను అలంకరించగా , అందరి సమక్షంలో డాక్టర్ వై వి మల్లారెడ్డి, శ్రీమతి డోరీన్ రెడ్డి గార్ల 50 దశకాల సేవలను కొని యాడుతూ అందరి సమక్షంలో వారిని ఘనంగా సన్మానించారు. ■

వేరెవ్వరో ప్రోత్సహించడం కాదు, నిన్ను నీవే ప్రోత్సహించుకోవాలి ; స్వయం ప్రోత్సాహం అమోఘం

# గో ఆధారిత వ్యవసాయమే పరిష్కారం ... మిగతావన్నీ గారడీలే!

## 'ఎస్ పి కె' వ్యవసాయం మాత్రమే కాదు ... అది ఒక ఆధ్యాత్మిక మార్గం: పాలేకర్

**– మురళీ జాజున, వికాస్**

ప్రస్తుతం మనం అనుసరిస్తున్న ఏరకమైన వ్యవసాయ విధానమూ రసాయన రహితం కాదని, ఇంతేకాకుండా, ప్రకృతి వ్యవసాయం అనేది కూడా కేవలం మాటల గారడీ మాత్రమేనని ఈ రెండూ భస్మాసుర హస్తం లాంటివని సుప్రసిద్ధ నూతన వ్యవసాయ విధాన రూపశిల్పి, పద్మశ్రీ పురస్కార గ్రహీత, డాక్టర్ సుభాష్ పాలేకర్ ఉద్ఘాటించారు.

'సుభాష్ పాలేకర్ కృషి (ఎస్‌పికె) కేవలం వ్యవసాయం మాత్రమే కాదు, ఇది ఒక ఆధ్యాత్మిక మార్గం కూడా" అని ఆయన పేర్కొన్నారు. ఆధ్యాత్మికం, మతం వేరువేరని, ఆధ్యాత్మికం అంటే సమాజంతో మనం ఎలా ప్రవర్తిస్తున్నామో తెలుపుతుందని శ్రీ పాలేకర్ చెప్పారు. "భూమి మీద మనకు వున్న బాధ్యత సమస్యలను పరిష్కరించడం, కానీ కొత్త సమస్యలను సృష్టించడం కాదు." సమస్యలకు మూలకారణం తెల్సుకుంటేనే సమస్య పరిష్కారం సులభం అవుతుందని పాలేకర్ అన్నారు.

జనవరి 21 వ తేదీన హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో ఏపిమాస్ ఆధ్వర్యంలో, సేవ్ ఫౌండేషన్ తోడ్పాటుతో సుభాష్ పాలేకర్ కృషి (ఎస్‌పికె)ని విస్తృతంగా ప్రోత్సహించడంలో ఎఫ్ పి ఓ లను ఎలా భాగస్వామ్యం చేయాలో చర్చించడంకోసం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ పాలేకర్ ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు.

ఎస్‌పికె ప్రకారం, ప్రకృతిలో ఉండేది మాత్రమే ప్రకృతి వ్యవసాయమని, ప్రకృతిలో ఉండనిది ప్రకృతి వ్యవసాయం కాదని ఆయన విస్పష్టంగా పేర్కొన్నారు.

హరిత విప్లవంఆహార సంక్షోభానికి నిజమైన పరిష్కారం అందించలేకపోయిందని, ఆ విప్లవ ఫలితంగా రసాయన ఎరువులను, పురుగు మందులను విపరీతంగా వాడి మనం భూమిని నిస్సారం చేస్తున్నామని, రాబోయే తరాలకు తీవ్రమైన కీడు చేస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

భవిష్యత్తులో ఆహార సమస్య అధికంగా ఉండబోతున్నదని, దానికి నివారణ గో ఆధారిత వ్యవసాయం మాత్రమేనని శ్రీ పాలేకర్ నొక్కి చెప్పారు. వర్మీ కంపోస్టు లాంటివి ప్రాసెస్ చేసినవని, వాటి వల్ల ఉపయోగం లేదని ఆయన తేల్చి చెప్పారు. ప్రాసెస్ చేసిన పదార్థాలలో ప్రకృతి తత్త్వం లోపిస్తుందని ఆయన అన్నారు.

ఆవు దేవుని సృష్టి, ఆవు ప్రకృతి నుండి ఆహారం తీసుకొని పేడ, మూత్రం విసర్జిస్తుంది. వాటిని నేరుగా భూమికి అందించినపుడే లాభమని చెబుతూ, భూమిలో ఉన్న సూక్ష్మజీవులు చెట్ల వేర్ల దగ్గర స్థిరపడ్డప్పుడు హ్యూమస్ ఏర్పడుతుందని, హ్యూమస్ మొక్కల వేర్ల సమీపంలోనే ఉత్పన్నమవుతుందని, అది పరిశ్రమల్లో తయారవదని శ్రీ పాలేకర్ వివరించారు.

డబ్ల్యు టి ఓ వంటి అంతర్జాతీయ సంస్థలు ప్రభుత్వాలను నియంత్రిస్తున్నాయని, వాటి వ్యాపారాలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలపై అవి ప్రభావం చూపుతున్నాయని, ప్రపంచంలోని దేశాలన్నీ ఈ ప్రభావాన్ని తప్పించుకోలేక పోతున్నాయని, దానివల్ల వచ్చే నష్టాలు, సమస్యలపై ఆలోచించడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

దేశంలో అనేక ఎఫ్ పి ఓలు ప్రారంభంలో ప్రభుత్వ మద్దతుతో కేవలం మూడు సంవత్సరాల పాటు మాత్రమే పనిచేసి, ఆపై కొనసాగలేకపోతున్నాయని, 90% సంస్థలు ఆపై మూతపడుతున్నాయని, కేవలం ప్రభుత్వ నిధులపై ఆధారపడటం సరికాదని పాలేకర్ అన్నారు.

14 లక్షల కోట్ల రూపాయలను మన దేశం రసాయన ఎరువుల కొనుగోలుకు ఉపయోగిసుస్తున్నదని, ఈ మొత్తం విదేశాలకు వెళ్తోందని, మనం ఎస్‌పికె ప్రకారం వ్యవసాయం

చేస్తే ప్రతి గ్రామం కనీసం 2 కోట్ల రూపాయలను ఆదా చేసుకోగలుగుతుందని, మన డబ్బు మన వద్దే ఉంటుందని. మనకు అవసరమైన అన్ని రకాల ఉత్పత్తులను మనమే పండించగలిగితే, మార్కెట్లో చలామణి పెరుగుతుందని, దీనివలన ఇతర దేశాల నుండి దిగుమతులు చేసుకోవాల్సిన అవసరం ఉండనే ఉండదని ఆయన అన్నారు.



**ఎస్ పి కె ప్రచారోద్యమం**

అంతకు ముందు, సమావేశ ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలనానంతరం ఏపిమాస్ సి ఇ ఓ, ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి ముఖ్య అతిథులైన శ్రీ సుభాష్ పాలేకర్ , సేవ్ ఫౌండేషన్ అధినేత శ్రీ విజయరాం, మాపల్లె చారిటేబుల్ ట్రస్టు అధినేత శ్రీనర్సన్న, ఏపిమాస్ పాలకవర్గం ఛైర్మన్ శ్రీ కాకి మాధవరావు, సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన వివిధ సంస్థల ప్రతినిధులకు సాదర స్వాగతం పలికారు.

ఈ సమావేశంలో 70 మందికి పైగా వివిధ సంస్థల ప్రతినిధులు, ఎస్పికె పాటిస్తున్న రైతులు, ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు, ఎస్పికెపై ఉత్సాహం చూపించే రైతులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో సుభాష్ పాలేకర్ కృషి (ఎస్పికె)ని విస్తృతంగా ప్రోత్సహించడంలో ఎఫ్పిఓలను ఎలా భాగస్వామ్యం చేయాలో చర్చించుకోవడం కోసమే ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు శ్రీ సి ఎస్ రెడ్డి తన స్వాగతోపన్యాసంలో పేర్కొన్నారు. ఈ సమావేశం ఏర్పాటుకు సహకరించిన శ్రీ విజయరాం గారికి ఆయన అభినందనలు తెలిపారు.

వచ్చే ఏప్రిల్ నెలలో సుభాష్ పాలేకర్ కృషి విధానంపె కన్హా శాంతివనంలో ఎస్ పి కె పట్ల ఆసక్తి కలిగిన రైతుల కోసం ఎనిమిది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టబోతున్నామని అన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రతి ఎఫ్.పి.ఓ నుంచి, ప్యాక్స్ (పి ఎ సి ఎస్) నుంచి 10 మంది చొప్పున రైతులను పంపించాలని, ఈ సమావేశానికి హాజరైన ఎఫ్.పి.ఓ.లు, ప్రోత్సహక సంస్థలు ఈ విషయంలో పూర్తి బాధ్యత తీసుకోవాలని శ్రీ సి ఎస్ రెడ్డి కోరారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 7000 మందికి పైగా రైతుల భాగస్వామ్యంతో నిర్వహించబోతున్నట్లు ఆయన తెలిపారు.

**25,000 మందికి పైగా రైతులకు అవగాహన**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 25,000 మందికి పైగా రైతులకు పాలేకర్ కృషిపై అవగాహన కల్గించాలనే లక్ష్యంతో తాము పని చేస్తున్నట్టు సేవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ విజయరాం తెలిపారు.

సుభాష్ పాలేకర్ కృషి 1985లో ప్రారంభం అయిందని, మన రాష్ట్రంలో 2017లో శ్రీ చిన్నజీయర్ స్వామి ప్రోద్భలంతో 10 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించామని, రాబోయే ఏప్రిల్ నెలలో 8 రోజుల అవగాహనకు ప్రణాళిక వేశామని ప్రతీ గ్రామం నుండి కనీసం ఐదుగురు ఉత్సాహవంతులైన రైతులను ఇందులో భాగస్వామ్యం చేయాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమ నిర్వహణకు చాలామంది దాతలు విరాళాలు ఇస్తున్నారని, ఇంకా 50 లక్షల పైచిలుకు లోటు ఉన్నదని అన్నారు. ప్రతి రైతు రూ. 1200 చొప్పున ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలియజేశారు.

శ్రీ నర్సన్న మాపల్లె సంస్థ ద్వారా చేస్తున్న సేవల గురించి, ముఖ్యంగా దేశీ విత్తనాల బ్యాంక్ నిర్వహణ, మిల్లెట్‌లతో చేసిన ప్రసాదాలనే తాము నిర్వహిస్తున్న ఇందూర్ వెంకటేశ్వర ఆలయంలో ఇవ్వడం, ఆలయాన్ని కేంద్రంగా చేసుకొని కార్యక్రమాలు నిర్వహించడం వెలకట్టలేనివని తెలిపారు. ముఖ్యంగా గ్రామాలలో కూడా పౌష్టిక ఆహార



లోపం వల్ల సంతానలేమి సమస్యలు పెరుగు తున్నాయని ఆందోళన వ్యక్తపరచారు.

**పాల్గొనాలనుకునేవారికి వుండవలసిన ఆసక్తులు**

1. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కలిగి ఉండడం.
2. తమ స్వంత భూమిని ప్రకృతి వ్యవసాయం విధానంలో మార్చాలని ఉద్దేశించటం.
3. శ్రీ సుభాష్ పాలేకర్‌గారితో నేరుగా చర్చించాలని కోరుకోవడం,
4. శ్రీ పాలేకర్ గారి నుండి కొత్త విషయాలు నేర్చుకోవాలని ఆసక్తి చూపటం.
5. ప్రకృతి వ్యవసాయంలోని కొత్త అంశాలను తెలుసు కోవాలని ఆసక్తి.
6. సుభాష్ పాలేకర్ విధానాల సహాయంతో మందులేని ఆరోగ్యకరమైన జీవనశైలిని ఎలా సాధించవచ్చో తెలుసుకోవాలన్న ఆకాంక్ష.
7. సుభాష్ పాలేకర్ కృషితో భాగస్వామ్యాన్ని ఎలా ఏర్పరచు కోవచ్చో తెలుసుకోవడం.

**ఎస్‌పికె విధానాలు**

- ఎలాంటి ఎరువులు అవసరం లేదు.
- ప్రకృతి కానివి ఏవీ వాడకూడదు.
- జీఎం విత్తనాలు అవసరం లేదు, సాధారణ విత్తనాలు సరిపోతాయి.
- ఎస్‌పికె విధానంలో పంటలకు ఎలాంటి వ్యాధులు లేదా పురుగులు సోకవు



**సదస్సులో పాల్గొన్న వారి సూచనలు**

1. ఎస్‌పికె విధానాన్ని ప్రారంభించడానికి ముందు, ఎఫ్ పి ఓల, పాక్స్‌ల పాలక వర్గాలచే (బిఓడీ) ఆ విధానాలను అంగీకరింపజేయడానికి చర్యలు తీసుకోవాలి.
2. ఎఫ్‌పీఓలో ఉత్పత్తిదారులతో పాటు వినియోగ దారులను కూడా చేర్చితే, మార్కెటింగ్ సులభంగా జరగవచ్చు.
3. శిక్షణ కార్యక్రమాల్లో పాఠశాల పిల్లలను చేర్చాలి.
4. ఎపెక్స్ బ్యాంక్ సిజిఎం ఆధ్వర్యంలో ప్యాక్స్‌ని ఎఫ్‌పిఓలుగా మార్చే ప్రయత్నం చేయాలి.
5. ఎఫ్‌పిఓలను, పాక్స్‌లను అనుసంధానించాలి.
6. ఎఫ్‌పిఓల ఉత్పత్తుల గురించి గ్రామాల్లో సమాచారం ఇవ్వడం ద్వారా అవగాహన కల్పించాలి.
7. గ్రామాల్లోనే మార్కెటింగ్ చేపట్టాలి.
8. ఇథనాల్ ఉత్పాదన కోసం భారీ పరిశ్రమల స్థాపన కంటే, రైతులే చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఉత్పత్తి చేయవచ్చు. ప్రభుత్వం ఇందుకు వీలు కల్పించాలి అని సుభాష్ పాలేకర్ సూచించారు.

శ్రీ నర్సన్న శ్రీ సుభాష్ పాలేకర్‌తో తన ప్రస్థానాన్ని ఆధారంగా చేసుకుని ఎస్‌పికె విధానంపై రచించిన పాటను స్వయంగా సుభాష్ పాలేకర్ గారిచేతుల మీదుగా ఆవిష్కరించి. సభ్యులకు వినిపించారు.

■

ఒకరిని అంచనావేయడం వల్ల వారెలాంటివారో తెలిసే కన్న నీవెలాంటివాడివో తెలుస్తుంది.

# 'ఉపాధి హామీ' ఉద్యమనేత బేడీ కన్నుమూత!

**'యం**గ్ ఇండియా ప్రాజెక్టు' ద్వారా నిరుపేద ప్రజలకు సేవలందించిన శ్రీ నరేంద్రసింగ్ బేడి (94) జనవరి 20 వ తేదీన కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గుట్టూరు గ్రామంలోని తన ఫామ్ హౌసలో తుది శ్వాస విడిచారు. సంపన్న వర్గాల కుటుంబంలో జన్మించి, జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్నటువంటి యూనివర్సిటీలలో ఉన్నత చదువులు చదివి నిరుపేదలు పడుతున్న కష్టాలను చూసి చలించి అణగారిన వర్గాల కోసం 'నేను సైతం' అంటూ ముందుకు వచ్చి నడుం బిగించి ప్రజలను చైతన్యపరిచి, ఎన్నో ఉద్యమాలు, పోరాటాలుచేసి పేద ప్రజల హక్కులను కాపాడి సమ సమాజ స్థాపన కోసం తన మొత్తం జీవితాన్ని, ఆస్తిని ధారబోసిన త్యాగశీలి శ్రీ నరేంద్ర సింగ్ బేడి పంజాబ్‌కు చెందిన వారు.



1970 సెప్టెంబరు 12న గుట్టూరు వద్ద 'యంగ్ ఇండియా' ప్రాజెక్టును స్థాపించి, పేదల కోసం అనేక ఉద్యమాలు చేశారు. ప్రభుత్వ భూమిని ప్రజలకు పంపిణీ చేయడంలో కృషి చేశారు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు, అనుబంధంగా వ్యవసాయ కూలీల యూనియన్లను ఏర్పాటు చేసి యూనియన్ల ద్వారా ఎన్నో ఉద్యమాలు చేసి, నిరుపేదలకు లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూమిని పంచడమే కాకుండా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రావలసిన సంక్షేమ పథకాల కోసం, అర్హులైన వారంద రికీ సంక్షేమ పథకాలు అందేలా పేద ప్రజలను చైతన్య పరచడం, వికలాంగులకు ప్రత్యేకమైన నిధులను సమకూర్చి వారికి కావలసిన అవయవాలను ఉచితంగా పంపిణీ చేయడం, మహిళా సాధికారత కోసం మహిళా సంఘాలను ఏర్పాటుచేసి, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యవంతులు చేయడం, నిరుపేదలను స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయించి నాయకులుగా తయారు చేయడం, చేతివృత్తులను, సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించడం లాంటి ఎన్నో కార్యక్రమాలను అనంతపురం ఉమ్మడి జిల్లాతో పాటు రాయలసీమ మొత్తం జిల్లాలలో సేవలను కొనసాగించిన ఘనత యంగ్ ఇండియా ప్రాజెక్టు సంస్థకు దక్కుతుంది.

కరువు, పేదరికానికి నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. సుస్థిర, సేంద్రియ వ్యవసాయం, ఉపాధి కల్పన ద్వారా జిల్లాను అభివృద్ధి వైపు నడిపించారు. ఉత్తమ పౌర సమాజమే లక్ష్యంగా పని చేశారు. భూ గరిష్ఠ పరిమితి చట్టం ద్వారా పేదలకు భూములు దక్కేలా చేశారు. తనకల్లు మండలంలో వందల ఎకరాలను పేదలకు అప్పగించడంలో కీలక పాత్ర పోషించారు.

ఉపాధి హామీ పథకం కోసం ఢిల్లీకి సైకిల్ యాత్ర చేశారు. ఆయన కృషితోనే 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకా'నికి రూపకల్పన జరిగింది. 'సమ సమాజ స్థాపన కోసం తన జీవితాన్ని, ఆస్తిని ధారపోసిన త్యాగశీలి బేడీ' అని ఈ సందర్భంగా ప్రజలు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి ఏపీతో పాటు తమిళనాడు, కర్ణాటకల్లో అనేక సామాజిక కార్యక్రమాలు, వ్యవసాయ కూలీలకు సేవలు అందించారు. దేశంలో ఉపాధి చట్టం రూపకల్పన, దాని అమలులోనూ ఆయన కీలకపాత్ర పోషించినట్లు ప్రజాసంఘాల నాయకులు గుర్తు చేసుకున్నారు.

■

# అవగాహనను, అనుభూతిని అందించిన 'విప్రో కేర్స్' సమ్మేళనం!

– భవాని, జాహ్నవి

ప్రసిద్ధ ' విప్రో ' సంస్థ ఆధ్వర్యంలో సామాన్య ప్రజలకు చక్కని ఆరోగ్యం, మంచి పోషణ అందించడం లక్ష్యంగా 2008లో 'విప్రో కేర్స్' సంస్థ ఏర్పాటైంది. ఈ సంస్థ 13 రాష్ట్రాల్లో 28 భాగస్వామ్య సంస్థల తోడ్పాటుతో ఐదు లక్షల మందికి పైగా సామాన్య ప్రజానీకానికి ప్రాథమిక ఆరోగ్యం, పోషకాహారం, ఆరోగ్యకరమైన వ్యక్తిగత అలవాట్ల సేవలను అందిస్తున్నది. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి భాగస్వామ్య సంస్థల ప్రతినిధులందరినీ ఒకే వేదికపైకి తీసుకువస్తూ, ఒక మహా సమ్మేళనాన్ని విప్రో కేర్స్ సంస్థ నిర్వహిస్తుంది. ఈ ఏడాది ఈ మహా సమ్మేళనం హైదరాబాదు శివారు చేగూరులోని కన్హా శాంతి వనంలో జనవరి 23 నుండి 25 వరకు మూడురోజులపాటు జరిగింది.



ఈ సంవత్సరం జరిగిన సమ్మేళనంలో (ఫోరమ్‌లో) ప్రతి భాగస్వామ్య సంస్థకు తమ కార్య కలాపాలను, విజయాలను, ఎదురైన సవాళ్ళను, వాటి పరిష్కార మార్గాలను ఇతరులతో పంచుకునే అవకాశం లభించింది. ముఖ్యంగా ఆరోగ్యం, పోషణకు సంబంధించిన ప్రాథమిక సేవలను సామాన్య ప్రజలకు చేరవేయడానికి అవసరమైన అవగాహనను, వ్యూహాలను ప్రదర్శనాత్మకంగా వివరించిన తీరు చెప్పుకోదగినది. విప్రో కేర్స్ భాగస్వామ్య సంస్థ గా ఏపిమాస్ తరపున సి ఇ ఓ, ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి, పట్టణ పోషణ పథకం ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీమతి భవాని, మెంటార్ జాహ్నవి గారు, ఫైనాన్స్ డైరెక్టర్ శ్రీ శ్రీనివాస్‌రెడ్డి ఈ మూడురోజుల సమ్మేళనంలో పాల్గొన్నారు.

**చర్చించిన కీలక అంశాలు:**

**1. ఆహారపు అలవాట్లు , పోషణ**

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం, ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలు, కిశోరబాలికల పోషకాహార లోపాలను తగ్గించడం ,సమాజంలోని అన్ని వర్గాలకు సరైన పోషకాలను అందించడంపై విస్తృత చర్చలు జరిగాయి.

**2. మానసిక ఆరోగ్యం**

ప్రజలకు మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతను వివరించి, దానిపై అవగాహనను కలిగించడం అవగాహనలో సమాజంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయడం. మానసిక సమస్యలను గుర్తించి, వాటిని సమర్థంగా పరిష్కరించడానికి కృషి చేయడం

**3. ప్రాథమిక ఆరోగ్య సేవలు**

ఆరోగ్య సేవల ప్రాధాన్యతను వివరించడంతో పాటు, వీటిని సామాన్య ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకురావడం కోసం భాగస్వామ్య సంస్థలు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కలిగించడం

**భాగస్వామ్య సంస్థల అనుభవాల మార్పిడి**

ఈ ఫోరమ్ భాగస్వామ్య సంస్థల మధ్య పరస్పర సంబంధాలను బలపరచడంలో ముఖ్య పాత్ర పోషించింది. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని అనుభవాలను పంచుకున్నారు. అనుభవాల మార్పిడి ద్వారా సేవల రూపకల్పన, అమలు ప్రక్రియలు మరింత మెరుగుపడే అవకాశం ఏర్పడింది.

ఈ ఫోరమ్ ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం పట్ల భాగస్వామ్య సంస్థల అంకితభావాన్ని మరింత బలపరిచింది. విభిన్న ప్రాంతాల్లో, విభిన్న అనుభవాలతో సమాజపు ఆవశ్యకతలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించడం ఈ కార్యక్రమంలో ఒక ప్రధాన అంశంగా







నిలిచింది. ఫలితంగా పారదర్శకత, సహకార భావన పెరిగింది, భాగస్వామ్య సంస్థల మధ్య అవగాహన పెరిగింది. కొత్త వ్యూహాలను చర్చించి, ఆచరణాత్మక ప్రణాళికలను రూపొందించుకున్నారు.

**ఏపిమాస్ అనుభవం**

ఈ కార్యక్రమం ద్వారా ఏపిమాస్, తదితర భాగస్వామ్య సంస్థలు తమ ప్రాథమిక లక్ష్యాలను మరింత స్పష్టంగా




అవగాహన చేసుకోగలిగాయి. భాగస్వామ్య సంస్థలతో కలిసి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి మరింత ఉత్సాహంగా ముందడుగు వేయడానికి సమాయత్తమైనాయి.

కన్హా శాంతి వనమ్ వంటి ప్రశాంత, పర్యావరణ హిత ప్రదేశాన్ని ఈ సమ్మేళనానికి వేదికగా ఎంచుకోవడం చాలా ఆనందంగా అనిపించింది. ఈ ఫోరమ్‌కు మమ్ములను ఆహ్వానించినందుకు విప్రో కేర్స్ సంస్థకు ఏపిమాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నది. మూడు రోజుల ఫోరమ్ ఎంతో ఆనందకరంగా, వివిధ సంస్థల సభ్యుల పరిచయాలతో, అంతర్గత చర్చలతో వేగంగా గడిచిపోయింది.

నిపుణుల ప్రసంగాలు ఎంతో ఆసక్తికరంగా, సభ్యుల ఆలోచనా పరిధిని పెంచేవిధంగా సాగాయి. సమ్మేళనంలో అందించిన రుచికరమైన ఆహారం, నివాస సదుపాయాలు చక్కని అనుభూతిని మిగిల్చాయి. హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ వారు నిర్వహించిన మూడు ధ్యాన సెషన్లు ప్రశాంతతను, మనశ్శాంతిని అందించాయి.

ప్రముఖ సితార వాద్య కళాకారుడు చిరాగ్ కట్టి, అతని బృందం నిర్వహించిన సంగీత విభావరి మంత్ర ముగ్ధంగా అనిపించింది, మాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి దోహదపడింది.

ఈ కార్యక్రమంలో విప్రో సంస్థ బృందం సభ్యులు ఆకాంక్ష, పార్వతి, నేహా, అర్చన, ప్రవీణ్, నరసింహ అందించిన అద్భుతమైన తోడ్పాటుకు మా ధన్యవాదాలు. వారి అమోఘమైన ఆతిథ్యం మాకు మరచిపోలేని అనుభవాన్ని అందించింది !

■




**నీవు చేయవలసింది నీ సవాళ్లను పరిమితం చేసుకోవడం కాదు , నీ పరిమితులను సవాలు చేయడం**

# పుట్టగొడుగుల పెంపకంపై బీహార్ ఎఫ్‌పిసికి శిక్షణ

– వేద్ ప్రకాశ్ సింగ్, మణీంద్రనాథ్ ఉపాధ్యాయ

బీహార్ రాష్ట్రం, శివన్ జిల్లా, అందర్ బ్లాక్‌కు చెందిన 'జాగృతి మహిళా ఎఫ్ పి సి (వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ) సభ్యులకు 2025 జనవరి 21, 22 తేదీలలో పుట్టగొడుగుల పెంపకంపై ఏపిమాస్, ఆత్మ సంస్థలు నైపుణ్య శిక్షణ సమకూర్చాయి. ఈ శిక్షణ శిబిరంలో 35 మంది రైతులు పాల్గొన్నారు. పుట్టగొడుగుల పెంపకంలో 8 ఏళ్ళకు పైగా అనుభవం కలిగిన, అనేక ఎఫ్ పి ఓ లు, ఎన్ జి ఓలు, జీవిక రైతులకుశిక్షణ యిచ్చిన శ్రీ గౌతమ్ (శివన్ ఆత్మ ప్రతినిధి) శిక్షకుడుగా, డాక్టర్ మణీంద్రనాథ్, శ్రీ దేవేశ్ శుక్లా, 'ఆత్మ' శివన్ బృందం కార్యక్రమ సమన్వయకర్తలుగా వ్యవహరించారు.




రెండు రోజుల శిక్షణ శిబిరంలో మొదటి రోజు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. శిక్షకుడు శ్రీ గౌతమ్ తినదగిన, తినకూడని పుట్టగొడుగుల రకాల గురించి, పుట్టగొడుగుల పెంపకానికి కావలసిన సరంజామా గురించి. పుట్టగొడుగుల కంపోస్ట్ ఎరువు తయారీ విధానం గురించి వివరించారు.

పుట్టగొడుగుల ఉత్పాదకాలను, గుర్రపు ఎరువును లేదా సింథటిక్ కంపోస్ట్‌ను ఒక దీర్ఘ చతురస్రాకార పాత్రలో (టర్నర్) మధ్యన వదులుగా, చుట్టూ గట్టిగా వుండేలా వేసి, నీరు చల్లాలి. అనంతరం నత్రజని ఉత్పాదకాలను, జిప్సంను పైన చల్లాలి. ఆ పదార్థాలను బాగా కలయదిప్పాలి. ఇలా చేస్తే కంపోస్ట్ తాయారు కావడం (ఫెర్మెంటేషన్) మొదలవుతుంది.

మరుసటి రోజున శిక్షకుడు శ్రీ గౌతమ్, మొదటి రోజు జరిగిన శిక్షణాంశాలను పునశ్చరణ చేయించి, పుట్టగొడుగుల ఉత్పత్తిపై తదనంతర చర్యలను ప్రారంభించారు. ఆ దీర్ఘచతురస్రాకారపు పాత్రలోని పదార్థంపై పుట్టగొడుగుల మైసీలియమ్‌ను చల్లి, దానిపై పలుచని పొర మాదిరిగా మట్టి చల్లాలని, ఈ ప్రక్రియలో యిది ముఖ్యమైన అంశమని చెప్పారు. ఈ కంపోస్ట్ మడి చుట్టూ బాగా గాలివీచే ఏర్పాటు వుండాలని కూడా శిక్షకుడు శ్రీ గౌతమ్ వివరించారు. ఆపై 3–4 రోజులకు పుట్టగొడుగు విత్తనాలు పెరగడం మొదలవు తుందని, వాటిని ఎలా సంరక్షించాలో, ఎలా కోయాలో శ్రీ గౌతమ్ ప్రదర్శించి చూపారు.

ఈ రెండు రోయిజజుల శిక్షణలో పాల్గొన్న రైతులు పుట్టగొడుగుల పెంపకం ప్రక్రియను ఎంతో ఆసక్తిగా గమనించారు. వారు పుట్టగొడుగుల పెంపకంలోని మెళకువలను తెలుసుకోగలిగారు. తమకు ఈ శిక్షణ యిప్పించినందుకు వారు ఎంతగానో సంతృప్తి వ్యక్తంచేశారు.



శిక్షణ యిప్పించిన ఏపిమాస్, ఆత్మ సంస్థలకు వారు ధన్యవాదాలు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న రైతులలో 31 మంది వచ్చే సీజన్ నుంచే పుట్టగొడుగుల పెంపకం చేపట్టడానికి సంసిద్ధత వ్యక్తంచేశారు.

■

తప్పుచేస్తానేమోననే సంకోచం సృజనశీలతకు చేటుచేస్తుంది, ధైర్యంగా ముందడుగే దానికి మందు

# సీమ నీటి ప్రాజెక్ట్ పై భాగస్వామ్య బృందం సమీక్ష

– భవాని

రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్ (ఆర్ డబ్ల్యు ఐ) ప్రాజెక్ట్ ప్రగతి సమీక్ష 2025 జనవరి 21–22 తేదీల్లో ఏపిమాస్, అజీం ప్రేంజీ ఫౌండేషన్ (ఏపిఎఫ్) సంస్థల ప్రతినిధి బృందం సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది.

ఏపిమాస్ తరఫున సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి, సిఎస్ఆర్ హెడ్ శ్రీ అన్వర్, వాసన్ ప్రతినిధి శ్రీ చంద్రశేఖర్, ఆర్డబ్ల్యుఐ (రూరల్ వాటర్ ఇనీషియేటివ్ – ఆర్ డబ్ల్యు ఐ) అన్నమయ్య జిల్లా అధికారి, శ్రీమతి కళామణితో కూడిన అజీం ప్రేంజీ ఫౌండేషన్ బృందం, ఇతర ఏపీమాస్ ప్రాజెక్ట్ సిబ్బంది ఈ సమీక్షలో పాల్గొన్నారు.

ఈ సమీక్ష పర్యటన ముగింపులో ప్రగతి సమీక్ష కార్యశాలను నిర్వహించారు. శ్రీ సి ఎస్ రెడ్డి, ఏపిఎఫ్ బృందం ఈ ప్రాజెక్ట్ పురోగతిపై తమ పరిశీలనాంశాలను, సూచనలను అందించారు. ప్రాజెక్ట్ అమలు మరింత మెరుగుపడేలా చర్చలు జరిపారు.

ఈ సమీక్ష ప్రాజెక్ట్ పరిణామాలను అర్థం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించింది. తద్వారా భవిష్యత్తులో చేపట్టాల్సిన మార్పులకు మార్గదర్శకంగా నిలిచింది. ఈ సమావేశం రోజంతా ఎంతో ఉత్సాహంగా సాగింది.

శ్రీ అన్వర్ ఏపిమాస్ బృందంతోను, సిఆర్పిలతోను సమాలోచనలు జరిపారు.







ఈ ప్రాజెక్ట్ మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లోని 14 గ్రామ పంచాయతీలలో అమలు జరుగుతున్నది. సమీక్ష బృందం మిట్టమర్రి, ఆరోగ్యపురం పంచాయతీల శివారు గ్రామాలను సందర్శించి, ప్రాజెక్ట్ ద్వారా అమలులో ఉన్న చర్యలను సమీక్షించింది.

ఈ సమీక్ష గ్రామీణులతో ప్రత్యక్షంగా సమావేశమై ప్రాజెక్టు అమలుపై వారి అనుభవాలను, అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకోవడానికి, ప్రాజెక్ట్ కింద అందుతున్న ప్రయోజనాలను, ప్రభావాలను వివరంగా అర్థం చేసుకోవడానికి తోడ్పడింది.

ప్రాజెక్ట్ ద్వారా చేపట్టిన కొత్త తరహా జలవనరుల నిర్వహణ, వ్యవసాయానికి నీటి వనరుల వినియోగం, సమాజంలోని అవసరాలకు అనుగుణంగా అందిస్తున్న మద్దతు వంటి అంశాలను సమీక్ష బృందం పరిశీలించింది.

ప్రతి అంశాన్ని, ప్రతి చిన్న సందేహాన్ని క్షుణ్ణంగా చర్చించడం జరిగింది. కూలంకషంగా జరిగిన ఈ చర్చలు ప్రాజెక్ట్ పురోగతిపై సూత్రప్రాయమైన నిర్ణయాలు తీసుకునే దిశగా మలుపు తీసుకున్నాయి.

చర్చల తరువాత ప్రాజెక్ట్ బృందం సహకారంతో తదనంతర కార్యాచరణ ప్రణాళికను (ఫాలోఅప్ యాక్షన్ ప్లాన్) రూపొందించడం జరిగింది.

ఈ ప్రాజెక్ట్ ద్వారా మదనపల్లె ప్రాంతానికి ఆశించిన స్థాయిలో నీటి వసతిని సమకూర్చే కార్యక్రమం మరింత ప్రభావవంతంగా, ఫలప్రదంగా కొనసాగుతుందనే నమ్మకం కలిగింది.

■

పుట్టిన రోజు గొప్పదే, కాని ఎందుకు పుట్టామో తెలుసుకోగలిగితే ఆరోజు అంతకంటె గొప్పది

# కొత్త పద్ధతులతో కుండల తయారీ శిక్షణ

– నేనావాత్ రాజు

ఏపిమాస్ నేతృత్వంలో, సిడ్బి (ఎస్ ఐ డి బి ఐ), ఖాదీ గ్రామీణ పరిశ్రమల కార్పొరేషన్ (కె వి ఐ సి) సహకారంతో నారాయణ ఖేడ్ బ్లాక్‌లో కుమ్మరి వృత్తివారిని, ముఖ్యంగా మహిళలను గుర్తించి, కొత్త పద్ధతులలో కుండల తయారీపై నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ శిక్షణ కుండల తయారీ వృత్తి కళాకారుల నైపుణ్యాలను మెరుగుపరచడం, ఆదాయాన్ని మార్గాలను పెంచడం, ఆధునిక మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా



సాంప్రదాయ కుండల తయారీ పద్ధతులను సంరక్షించడం లక్ష్యంగా పెట్టుకుంది.

తాజాగా, నారాయణ ఖేడ్ బ్లాక్ పరిధిలోని గ్రామాలలో ఉండే కుమ్మరి వృత్తుల వారి నుండి 20 మందిని ఎంపిక చేసి 21.11.2024 నుండి 30.11.2024 వరకు (10 రోజుల పాటు) కె వి ఐ సి సహకారంతో నిజాంపేటలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడము జరిగింది.

శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన 20 మంది మహిళలకు, ఖాదీ గ్రామీణ పరిశ్రమల కార్పొరేషన్ ( కె వి ఐ సి) చైర్మన్ శ్రీ. మనోజ్ కుమార్ ద్వారా శిక్షణ సర్టిఫికేట్‌తో పాటు, 25000 వేల రూపాయలు విలువగల మర చక్రం (సారె–ఎలక్ట్రానిక్ మిషన్) ఉచితణగా ఇవ్వడం జరిగింది.

**లక్ష్యాలు**

- చక్రంపై చేతితో తయారు చేయడం, గ్లేజింగ్ , కాల్చే పద్ధతులతో సహా అధునాతన కుండల తయారీకి గ్రామీణ మహిళలను సన్నద్ధం చేయడం.
- సాంప్రదాయ కుండలకు నూతన ఆవిష్కరణ విధానాలను, సమకాలీన నగిషీలను పరిచయం చేయడం.
- కొత్త ఉత్పత్తి పద్ధతులను అన్వేషించడం, ఆధునిక ధోరణులను అమలు చేయడం ద్వారా కుండల విక్రయాలను మెరుగుపరచడం.
- వ్యాపార ప్రణాళిక, మార్కెటింగ్, అమ్మకాల వ్యూహాలపై మార్గదర్శనం అందించడం ద్వారా ఉపాధి నిర్వహణను ప్రోత్సహించడం.
- కుండల తయారీ ఆధారిత ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా గ్రామీణ మహిళలకు స్థిరమైన జీవనోపాధిని కల్పించడం.

**శిక్షణ పద్ధతి**

- **సైద్ధాంతిక సెషన్లు:** కుండల తయారీ చరిత్ర, రూపకల్పన సూత్రాలు, రంగు సిద్ధాంతం, మార్కెట్ ధోరణులు, వ్యాపార ప్రణాళిక వంటి అంశాలపై అవగాహన కలిగించడం
- **ప్రాక్టికల్ ప్రదర్శనలు:** అనుభవజ్ఞులైన కళాకారులు అధునాతన పద్ధతులను ప్రదర్శించడం ద్వారా,

  అవి: కుమ్మరి చక్రంపై తిప్పడం, చక్రంపై మట్టిని కుండ ఆకృతికి తీసుకువచ్చే కళాత్మక విధానాలను నేర్చుకోవడం, కాయిల్ బిల్డింగ్, స్లాబ్ బిల్డింగ్ మరియు పించ్ పాట్స్ వంటి పద్ధతులను అన్వేషించడం.

  గ్లేజింగ్: వివిధ గ్లేజ్‌లను వర్తింపజేయడం మరియు తుది ఉత్పత్తిపై వాటి ప్రభావాలను అర్థం చేసుకోవడం.
- **కాల్చే పద్ధతులు:** ఎలక్ట్రిక్ ఆమం (బట్టీ) , సంప్రదాయ ఆమం నిర్వహణతో సహా వివిధ కాల్చే పద్ధతుల గురించి తెలుసుకోవడం.

ఒంటరిగా కుంగిపోతే ప్రతి చిన్న సమస్య కొండంత , సరైనవారితో పంచుకుంటే గురిగింజంత

### 20 రకాల కుండలు చెయ్యడం నేర్చుకున్నాం



**"ఇం**తకు ముందు పాత పద్ధతి ప్రకారం చేస్తుంటిమి. ఇప్పుడు తక్కువ సమయంలో ఎక్కువ కుండలు తయారు చేస్తున్నాము. 20 రకాల కుండలు చెయ్యడం నేర్చుకున్నాము. దీని ద్వారా మా కుటుంబ పోషణ మంచిగా జరుగుతుంది. ఈ శిక్షణకు అవకాశం కల్పించిన ఏపిమాస్, సిడ్బి, కెవిఐసి వారికి మా ధన్యవాదములు"– కుమ్మరి మణెమ్మ, నిజాంపేట్

### మహిళలం కూడా చేయగలగుతున్నాం



**"ఈ** శిక్షణ పొందడం ద్వారా మేము మహిళలము కూడా ఇప్పుడు ఈ కుండలు తయారు చేయగలుగుతున్నాము. ఈ శిక్షణతో పాటు పనిముట్లు, శిక్షణ సర్టిఫికేట్‌లు కూడా ఇచ్చారు. ఈ అవకాశము కల్పించిన ఏపిమాస్, సిడ్బి, కెవిఐసి వారికి మా ధన్యవాదాలు– కుమ్మరి నాగమణి సంజీవన్‌రావు పేట

- **ప్రయోగాత్మక అభ్యాసం:** శిక్షణలో పాల్గొనేవారు తాము నేర్చుకున్న పద్ధతులను వర్తింపజేసి తమ స్వంత రీతులతో ప్రత్యేకమైన కుండలను తయారు చేయడంలో విస్తృతమైన ప్రయోగాత్మక అభ్యాసంలో పాల్గొన్నారు.
- **క్షేత్ర సందర్శనలు:** మార్కెట్ డిమాండ్లు, విజయవంతమైన వ్యాపార నమూనాల గురించి లోతైన అవగాహన పొందడానికి కుండల తయారీ వర్క్‌షాపులకు, ప్రదర్శనలకు సందర్శనలు.
- **నిపుణుల ప్రసంగాలు:** కుండల తయారీ, మార్కెటింగ్, వ్యాపార నిర్వహణలో నిపుణులచే సెషన్లు విలువైన అవగాహనను, మార్గదర్శనాన్ని అందించడం.

**శిక్షణ ఫలితాలు**

- **మెరుగైన నైపుణ్యాలు:** శిక్షణపొందినవారు చక్రంపై తిప్పడం, మరచక్రం మీద కుండలు తయారు చేయడం, గ్లేజింగ్, కాల్చే పద్ధతులతో సహా కుండల తయారీ నైపుణ్యాలలో గణనీయమైన మెరుగుదలను ప్రదర్శించారు.
- **పెరిగిన సృజనాత్మకత:** కొత్త డిజైన్ ఆలోచనలను అన్వేషించి, సమకాలీన నగిషీలను, నూతన ఆవిష్కరణ అంశాలను జోడించి కుండలను తయారుచేశారు.
- **మెరుగైన ఉత్పత్తి నాణ్యత :** వీరు తయారు చేసిన కుండలు ఎంతో నాణ్యతతో, కళాకృతుల జోడింపుతో, చూడముచ్చటగా వుండడం విశేషం
- **మెరుగయ్యే విక్రయాలు :** శిక్షణపొందినవారు మార్కెట్ ధోరణులు మరియు వినియోగదారుల ప్రాధాన్యతల గురించి మెరుగైన అవగాహనను పొందారు. దీనివల్ల వారు మరింత గా విక్రయాలు చేయగలుగుతారు.



- **వ్యాపార అభివృద్ధి:** పాల్గొనేవారు వ్యాపార ప్రణాళిక, మార్కెటింగ్, అమ్మకాల వ్యూహాలపై అవగాహన పొందారు, వారు తమ స్వంత కుండల తయారీ వ్యాపారాలను స్థాపించడానికి, పెంచుకోవడానికి సాధికారత పొందారు.
- **పెరిగిన ఆత్మవిశ్వాసం:** ఈ శిక్షణ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. వారు కుండల తయారీని ఒక అనువైన జీవనోపాధిగా చేపట్టడానికి వీలు కల్పించింది. ■

# 'ఫిష్ ఆంధ్ర' హేమలతకు రాష్ట్రపతి గుర్తింపు !

'ఇప్పుడు ఎందుకు లే...' అని రాజీపడే వాళ్లు ఉన్నచోటే ఉండిపోతారు. 'ఎప్పుడు అయితే ఏమిటి!' అనుకుంటూ ఉత్సాహంగా కార్యక్షేత్రంలోకి దిగేవాళ్లు ఎప్పుడూ విజేతలే. అలాంటి ఒక విజేత పెబ్బటి హేమలత. పెద్ద చదువులు చదవకపోయినా... పెద్ద వ్యాపారవేత్త కావాలని కలలు కన్నది. హేమశ్రీ ఫ్యామిలీ రెస్టారెంట్ (ఫిష్ ఆంధ్ర)తో తన కలను నిజం చేసుకుంది. అత్యుత్తమ వ్యాపారవేత్తగా రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైంది.



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పురపాలక సంఘం పరిధిలోని సోమప్ప నగర్‌కు చెందిన హేమలత సాధారణ గృహిణి. కోడుమూరు మండలంలోని ఓ చిన్న గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టిన హేమలత ఇంటి నాలుగు గోడలకే పరిమితం కావాలనుకోలేదు.





ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనేది తన కల. స్నాక్స్ తినుబండారాలు)తో వ్యాపారం మొదలుపెడితే బాగుంటుందని ఆలోచించింది. కొంతమంది మహిళలతో కలసి చక్కిలాలు తయారు చేయటం మొదలు పెట్టింది. వాటిని పట్టణంలోని చిన్నచిన్న మిఠాయి కొట్లకు సరఫరా చేసేది.

క్రమంగా నలభై మంది మహిళలతో కలసి వ్యాపారాన్ని విస్తరించింది. పరోక్షంగా వంద మందికిపైగా ఉపాధి కల్పించింది. చకిలాలతోపాటు చెగోడిలు, నిప్పట్లు, బులెట్లు, మసాలా వడలు, స్వీట్స్ వంటి పదిరకాల స్నాక్స్‌ను తయారు చేసి ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలు, తెలంగాణలోని ఐజ, గద్వాల వరకూ అంగళ్లకు సరఫరా చేస్తోంది. ప్రతి రోజు రూ.30 వేలకు పైగా స్నాక్స్‌ను తయారు చేయించి మార్కెట్ చేస్తోంది. తన దగ్గర పనిచేసే నలభై మంది మహిళలతో నాలుగు పొదుపు గ్రూపులు ఏర్పాటు చేసి వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేసింది.

**నాన్ ఓవెన్ సంచులు**

ప్లాస్టిక్ వినియోగానికి ప్రత్యామ్నాయం ఆలోచించిన హేమలత బ్యాంక్‌ల సహకారంతో రూ.50 లక్షలతో కాలుష్యరహిత నాన్ ఓవెన్ సంచుల తయారీ యూనిట్‌ను ప్రారంభించింది. పది మంది వర్కర్స్‌తో ఈ యూనిట్‌ను నడుపుతోంది. 10-14 ఇంచుల సైజ్ మొదలు 16-21 సైజు వరకూ వివిధ రకాల బ్యాగ్‌లను తయారు చేయిస్తోంది. వినియోగదారుల డిమాండ్‌ను బట్టి డి-కట్, డబ్లూ-కట్, బాక్స్‌టైప్, స్టిచ్చింగ్ బ్యాగ్‌లను తయారు చేయిస్తోంది.

తమ దగ్గర తయారు చేసే నాన్ ఓవెన్ బ్యాగ్‌ల స్టిచ్చింగ్ పనిని పొదుపు సంఘాల్లో పనిచేసే మహిళా టైలర్‌లకు ఇస్తూ వారికి వేతనాలు చెల్లిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లోని

**ఉత్తమమైనదాని కోసం వెంపర్లాడడం కాదు, అందినదానిని అత్యుత్తమంగా మలచుకోవడం నేర్చుకో !**

# పారిశుధ్యం జయమ్మకు రాష్ట్రపతి ఆహ్వానం!

‘మన దేశంలో పేదలు కేవలం కలలు కనడం మాత్రమే కాదు, వాటిని నిజం చేసుకోగలరు కూడా ’ అనే మాట ఎన్నో సందర్భాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటి నుంచి వినిపించింది. పేదరాలైన జయమ్మ కల కన్నది. ‘నా కష్టాన్ని చూసి నలుగురు మెచ్చుకుంటే చాలు’ అనేది ఆ కల! అయితే, ఆమె కలను కేవలం నలుగురు మెచ్చుకోవడమే కాదు, సాక్షాత్తూ రాష్ట్రపతిభవన్ ఆమె కష్టాన్ని గుర్తించింది.



‘నీ భర్త ఏం పనిచేస్తాడు?’ అనే ప్రశ్నకు… జయమ్మ చెప్పిన జవాబుకు అవతలి వ్యక్తి ముఖం అదోలా మారిపోయేది. మాటల్లో చిన్న చూపు కనిపించేది.

నెల్లూరుకు చెందిన జయమ్మ ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికురాలు. దీంతోపాటు భర్తతో కలిసి సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ పనులు చేస్తుంది. ‘చేయడానికి మీకు ఈ పనే దొరికిందా తల్లీ’ అని వెక్కిరించిన వాళ్లు ఎందరో! అయితే ఏ రోజూ చేస్తున్న పనిపట్ల నిర్లక్ష్యం, విముఖత జయమ్మలో కనిపించలేదు. ఆమె రెక్కల కష్టం వృథా పోలేదు. వృత్తి పట్ల జయమ్మ అంకితభావానికి గుర్తింపుగా దిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి ఆహ్వానం అందింది.

‘పెద్దోళ్లకు అందరూ చుట్టాలే. పేదోళ్లకు కష్టాలే చుట్టాలు’ అంటుండేది జయమ్మ తల్లి రాజమ్మ.

---

మాల్స్, స్టోర్స్‌కు సరఫరా చేస్తోంది. నాన్ ఓవెన్ బ్యాగ్‌ల తయారీ టర్నోవర్ ఏడాదికి రూ. కోటి దాటిపోయింది. కోవిడ్ సమయంలో మాస్కులు, ఆస్పత్రి మెటీరియల్స్‌ను తయారు చేయించి ఎంతోమందికి ఉపాధి చూపింది.

**దక్షిణాదిలో నెంబర్‌వన్**

ప్రధానమంత్రి మత్స్య సహకార యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఫిష్ ‘ఆంధ్ర స్టోర్స్’ను ప్రోత్సహించింది. రూ. 3.25 లక్షల నుంచి రూ. 50 లక్షల విలువైన యూనిట్లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఫిష్ ఆంధ్ర లాంజ్ (కంటైనర్ మోడల్) యూనిట్ కోసం హేమలత దరఖాస్తు చేసుకోగా 40 శాతం సబ్సిడీతో యూనిట్ మంజూరైంది. హేమలత ఎమ్మిగనూరులో రూ. 50 లక్షలతో ఫిష్ ఆంధ్ర (హేమశ్రీ ఫ్యామిలీ రెస్టారెంట్) ను ప్రారంభించింది. ఫిష్ ఆంధ్ర నిర్వహణలో దక్షిణాదిలోనే ‘హేమశ్రీ ఫ్యామిలీ రెస్టారెంట్’ ప్రథమ స్థానంలో నిలిచింది. ఆరోజు మొక్కై మొలిచిన ‘హేమశ్రీ ఫ్యామిలీ రెస్టారెంట్’ ఇప్పుడు చెట్టై ఎంతోమందికి నీడనిస్తోంది.

**‘ఫిష్ ఆంధ్ర’కు రాష్ట్రపతి గుర్తింపు**

ఫిష్ ఆంధ్ర లాంజ్ (కంటైనర్ మోడల్) యూనిట్ కోసం హేమలత దరఖాస్తు చేసుకోగా 40 శాతం సబ్సిడీతో యూనిట్ మంజూరైంది. రూ. 20 లక్షలు సబ్సిడీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చగా, రూ. 7.5 లక్షలు హేమలత సమకూర్చుకుంది. మిగిలిన రూ. 42.50 లక్షలను బ్యాంక్ రుణంగా ఇచ్చింది. ‘ఫిష్ ఆంధ్ర లాంజ్.. హేమశ్రీ ఫ్యామిలీ రెస్టారెంట్’ తక్కువ కాలంలోనే విశేష ఆదరణ పొందింది. ఇప్పుడు రాష్ట్రపతి అవార్డుకు కూడా ఎంపికై డొమెస్టిక్ మార్కెటింగ్’ విలువను జాతీయ స్థాయికి తీసుకు వెళ్లింది. హేమలత ఎంతోమంది ఔత్సాహికులకు ‘ఐకానిక్ ఎంటర్‌ప్రెన్యూర్’గా స్ఫూర్తిని ఇస్తోంది.

– సాక్షి సౌజన్యంతో

■

ఓడించడం కాదు, మనసులను గెలుచుకో ;హేళనగా నవ్వడం కాదు అందరితో ఆనందంగా నవ్వుకో

ఆ ఇంటికి కష్టాలు కొత్త కాదు. కష్టపడడం కొత్త కాదు. నెల్లూరు నగరంలోని ఉమ్మారెడ్డిగుంట ప్రాంతానికి చెందిన జయమ్మ తన తల్లిదండ్రులకు సాయంగా రోజువారీ కూలీపనులకు వెళ్తుండేది. 'ఏ పనీ లేకుండా ఇంట్లో కూర్చోవడం కంటే పనికి పోవడమే నాకు ఇష్టం' అంటున్న జయమ్మకు 'శ్రమ' అనేది చిన్నప్పటి నేస్తం.

జయమ్మకు రమేష్‌తో వివాహం జరిగింది. రమేష్ మొదట్లో సెప్టిక్ ట్యాంక్ వాహనానికి డ్రైవర్‌గా వెళ్తుండేవాడు. పదేళ్లపాటు డ్రైవర్‌గా పనిచేసిన అనుభవంతో తానే సొంతంగా ఓ సెప్టిక్ ట్యాంకర్ సెకండ్ హ్యాండ్ వాహనాన్ని కొనుగోలు చేసి క్లీనింగ్ పనులు చేసుకుంటూ కుటుంబ పోషణ చేసేవాడు. ఇద్దరు పిల్లలు స్కూల్‌కి వెళ్లే వయస్సు వచ్చేవరకు గృహిణిగా ఉన్న జయమ్మ ఆ తరువాత భర్త చేసే సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ పనులకు తాను కూడా తోడుగా వెళ్తుండేది.

భూగర్భ డ్రైనేజీ పారిశుధ్య పనులకు వెళ్లే జయమ్మను తోటివారే చిన్నచూపు చూసేవారు. అవేమీ పట్టించుకోకుండా భర్తకు చేదోడువాదోడుగా ఉండేది. క్లీనింగ్ సమయాల్లో చర్మవ్యాధుల బారిన పడేది. ఈ దంపతుల కష్టాన్ని చూసిన 'నవజీవన్ ' అనే స్వచ్ఛంద సంస్థ నాలుగేళ్ల క్రితం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ షూరిటీతో పాటు ఎన్ ఎస్‌కేఎఫ్‌డీ శాఖ ఆధ్వర్యంలో బ్యాంకు రుణం మంజూరు చేయించింది.

రూ.10 లక్షల సబ్సిడీతో రూ.32 లక్షలు విలువైన కొత్త సెప్టిక్ ట్యాంకర్ క్లీనింగ్ వాహనాన్ని మంజూరు చేయించడంతో వారికి సొంతవాహనం సమకూరింది. దీంతో దంపతులిద్దరూ సొంత వాహనంతో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కార్పొరేషన్ అధికారుల సహకారంతో నగరంలోని ఎన్నో నివాసాల్లో సెప్టిక్‌ట్యాంక్ క్లీనింగ్ పనులు చేస్తున్నారు.

**అన్ని అంశాల్లో మంచి మార్కులు**

కేంద్ర ప్రభుత్వ ఎన్ ఎస్‌కేఎఫ్‌డీసీ (నేషనల్ సఫాయి కర్మచారీస్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్) పథకం లబ్ధిదారు అయిన జయమ్మ సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనానికి యజమాని అయింది. పథకాన్ని ఏ మేరకు సద్వినియోగం చేసుకున్నారు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా, సకాలం లో ఈఎంఐ కడుతున్నారా, లోడ్‌ను ఎక్కడంటే అక్కడ డంప్ చేస్తున్నారా లేక ప్రభుత్వం చూపిన పాయింట్‌లోనే డంప్ చేస్తున్నారా... ఇలాంటి అంశా లతో పాటు తగిన విధంగా జీవనోపాధి పొందుతున్నారా.. పోలీస్ స్టేషన్‌లో ఏమైనా కేసులు నమోదయ్యాయా... ఇలా ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ అధికారులు. అన్నింట్లో మంచి మార్కులు రావడంతో జయమ్మ కృషికి గుర్తింపు లభించింది. రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనడానికి రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం వచ్చింది.



**జీవితంలో మర్చిపోలేని రోజు**

'నమ్మిన పని ఎప్పుడూ మోసం చేయదు అనే మాట ఎన్నోసార్లు విన్నాను. ఆ నమ్మకంతోనే ఎంతమంది వెక్కిరించినా పట్టించుకోలేదు. మా ఆర్థిక స్థాయికి సెప్టిక్ ట్యాంకర్ క్లీనింగ్ బండికి సొంతదారులమవుతామని అనుకోలేదు. కష్టపడితే ఆ కష్టమే మనల్ని ముందుకు తీసుకువెళుతుంది' అంటూ ఆత్మవిశ్వాసం నిండిన గొంతుతో అంటుంది జయమ్మ.

'మేము చేసే వృత్తి తప్పుడు పనేం కాదు. మా రెక్కల కష్టాన్నే నమ్ముకుని పని చేసి కుటుంబాన్ని పోషించు కుంటున్నాం. అందులోనే మాకు సంతృప్తి ఉంది. ఎవరేమి అనుకున్నా మేము ఎప్పుడూ బాధపడలేదు. నా భర్తకు తోడుగా సాయంగా వెళ్లి క్లీనింగ్ పనులు చేస్తున్నా. గణతంత్ర వేడుకల్లో పాల్గొనాలని రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఆహ్వాన పత్రిక రావడం జీవితంలో మర్చిపోలేని సంఘటన. ఎంతో సంతోషంగా ఉంది' అని జయమ్మ ఆనందం వెలిబుచ్చింది.

– సాక్షి సౌజన్యంతో

■

# నాడు వ్యవసాయ కూలీ ... నేడు ఒక సంస్థ అధిపతి!

**ఒ**కప్పుడు వ్యవసాయ కూలీ. రోజు గడవడమే కష్టమయ్యేది. కానీ ఇప్పుడు... స్వయంశక్తితో ఎదిగి... కోటి రూపాయల టర్నోవర్ దాటిన కంపెనీకి అధిపతి అయ్యారు. జనపనార సంచుల తయారీ చేపట్టి... మరికొందరు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఎందరికో ఆదర్శంగా నిలిచిన ఆమెకు ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అరుదైన అవకాశం దక్కింది. పట్టుదలగా ప్రయత్నిస్తే అసాధ్యమేదీ లేదంటున్న కల్పనను ఆంధ్రజ్యోతి 'నవ్య' పలకరించింది. ఆ విశేషాలు ఆంధ్రజ్యోతి సౌజన్యంతో మీకు ...



**"జీ**వితమంటేనే ఎన్నో ఆటుపోట్లు. అన్నిటినీ తట్టుకొని ముందుకు వెళితేనే జీవనం సాగించగలుగుతాం. రోజంతా కష్ట పడినా ఇల్లు గడవని పరిస్థితుల నుంచి, నేడు నా కాళ్లపై నేను నిలబడే స్థాయికి ఎదిగాను. నాలాంటి మరికొంతమంది పేద మహిళలకు ఉపాధి మార్గమయ్యాను. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొంటే నాకు ఎంతో గర్వంగా అనిపిస్తుంది. దీని వెనుక ఎన్నో ఏళ్ల శ్రమ మాత్రమే కాదు... ఎన్నో త్యాగాలు కూడా ఉన్నాయి.

హనుమకొండ జిల్లా శాయంపేట గ్రామంలోని ఓ దిగువ మధ్యతరగతి కుటుంబం మాది. మా ఇంటికి సమీపంలో ఉండే దాసరి బాబుతో నాకు పెళ్లయింది. ప్రేమ వివాహం. మాకు ఇద్దరు కూతుళ్లు... అంజలి, అలేఖ్య. ఇంజనీరింగ్ చదువుతున్నారు. నేను, మావారు కలిసి వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసేవాళ్లం. ఆ కొద్దిపాటి సంపాదనతో కుటుంబ పోషణ కష్టమయ్యేది. 2001లో డ్వాక్రా మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరాను. కొద్ది రోజులకే అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. సంఘంలో చేరాక కుట్టు మిషన్ నేర్చుకున్నాను. కుట్టు పని మొదలుపెట్టాను.

**రుణం తీసుకొని...**

అయితే కుట్టు పనితో వచ్చేది ఇంట్లో కనీస ఖర్చులకు సరిపోయేది కాదు. దాంతో 2009లో స్వయం సహాయక సంఘం నుంచి లక్ష రూపాయల రుణం తీసుకుని, కిరాణా షాపు పెట్టాను. ఐదేళ్లకు ఆ రుణం తీరడంతో పిండి గిర్నీ మొదలుపెట్టాను. అదేసమయంలో నాకు కాస్త హిందీ తెలియడంతో... 'సెర్ప్' అధికారులు నన్ను 'కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్' (సీఆర్పీ)గా ఎంపిక చేశారు. అందులో భాగంగా ఉత్తరప్రదేశ్, మధ్య ప్రదేశ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో స్వయంసహాయక సంఘాల మహిళలకు పొదుపుపై శిక్షణ ఇచ్చాను.

**పిల్లలకు దూరంగా...**

సీఆర్పీగా 2016-19 మధ్య ఇలా చాలా పర్యటనలకు వెళ్లాను. వెళ్లినప్పుడల్లా 45 రోజులపాటు అక్కడే ఉండాల్సి వచ్చేది. ప్రయాణం, వసతి, భోజనం తదితర ఖర్చుల కోసం కొంత డబ్బు ఇచ్చేవారు. దాంతోనే మా ఇల్లు గడిచేది. మేం వెళ్లే ప్రాంతాల్లో సెల్ సిగ్నల్స్ ఉండేవి కావు. దానివల్ల రోజుల తరబడి మావారితో, పిల్లలతో మాట్లాడటం కుదిరేది కాదు. అన్నేసి రోజులు పిల్లలకు దూరంగా గడపడమంటే ఎంతో బాధగా ఉండేది. కళ్లల్లో నీళ్లు తిరిగేవి. పిల్లలను వదిలి టూర్లకు వెళ్లడం ఎందుకని బంధువులు, సన్నిహితులు అనేవారు. కానీ నేను, నా కుటుంబం ఏ లోటూ లేకుండా జీవించాలంటే బాధను దిగమింగుకోవాలి. కొన్ని త్యాగం చేస్తేనే ముందుకు సాగడం సాధ్యం. పిండిగిర్నీ మావారికి అప్పగించి నేను ఇతర రాష్ట్రాలకు వెళ్లేదాన్ని.

**కుదిపేసిన కరోనా ...**

కాస్త నిలదొక్కుకొంటున్నాం అనుకొనేలోపు కరోనా కుదిపేసింది. జీవితం తలకిందులైంది. పిండి గిర్నీపై



సంపాదన లేక, మావారు రైస్‌మిల్లులో పనికి వెళ్లారు. సంపాదన సరిపోక అప్పులు పెరిగాయి. వీటి నుంచి బయటపడాలంటే మరో వ్యాపారం చూసుకోవాలని అనుకున్నాను. కానీ ఏ వ్యాపారం పెట్టాలి?

యూట్యూబ్‌లో వెతుకుతుంటే జనపనార సంచులు (జ్యూట్ బ్యాగ్స్) తయారీ గురించి తెలిసింది. తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు సాధించవచ్చని చెప్పడంతో 2021లో 'స్త్రీ నిధి' పథకం ద్వారా రెండు లక్షలు రుణం తీసుకున్నాను. హైదరాబాద్ నుంచి ముడిసరుకు తెచ్చాను. ఇంట్లో ఉన్న మిషన్ మీద బ్యాగులు తయారు చేసి, స్థానికంగా అమ్మాం. లాభాలు పెద్దగా రాకపోవడంతో నలుగురం కలిసి ప్రారంభించిన ఈ ప్రాజెక్టు నుంచి ముగ్గురు తప్పుకున్నారు. అప్పుడు, పిల్లల స్కూలు ఫీజులకోసం... ప్రతి రూపాయికీ వెతుక్కోవాల్సి వచ్చేది. కేంద్ర ప్రభుత్వ 'లఖ్‌పతి దీదీ' పథకం ద్వారా రుణం తీసుకొని, రూ.15 లక్షలతో 'నానోఓవెన్ మిషన్' తీసుకువచ్చాం. చాలామంది వద్దని వారించారు. వారి మాటలు నాలో మరింత పట్టుదలను పెంచాయి. బ్యాగుల తయారీ మొదలుపెట్టాం.

**మరికొందరికి ఉపాధి...**

మా బ్యాగులకు వినియోగదారుల నుంచి మంచి స్పందన వచ్చింది. లాభాలు కనిపించాయి. రెండు దఫాలుగా మరో 11 లక్షల రుణం తీసుకొని వ్యాపారాన్ని విస్తరించాం. లాభాలను పెట్టుబడిగా మలిచి, ఉత్పత్తిని పెంచుకొంటూ వెళ్లాం. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా బ్యాగులు తయారు చేస్తూ, వారి నమ్మకాన్ని, ఆదరణను పొందాం. ఆరంభంలో నేను, మావారు చుట్టుపక్కల ఊళ్లకు వెళ్లి బ్యాగులు అమ్మేవాళ్లం. ఇప్పుడు వివిధ కంపెనీల నుంచి ఎన్నో ఆర్డర్లు వస్తున్నాయి. ముడిసరుకును బెంగళూరు, చెన్నైల నుంచి తెప్పిస్తున్నాం.

ప్రస్తుతం శాయంపేటలోని మా తయారీ కేంద్రంలో ఐదుగురు మహిళలు పని చేస్తున్నారు. మా టర్నోవర్ ఏడాదికి 1.25 కోట్ల రూపాయలకు చేరింది. ఖర్చులన్నీ పోను నెలకు రూ.75 వేలు మిగులుతుంది. రెండేళ్ల కిందట డీఆర్‌డీఏ అధికారుల నుంచి 'ఉమన్ లీడర్‌షిప్' అవార్డు అందుకున్నాను.

**అరుదైన అవకాశం...**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగే వేడుకల్లో పాల్గొనే అద్భుతమైన, అరుదైన అవకాశం నాకు లభించింది. 'గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ' (సెర్ప్) సహకారంతో పారిశ్రామిక వేత్తగా ఎదిగినందుకు నాకు ఈ ఆహ్వానం అందింది.

వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించడంతోపాటు ప్రధాని, పలువురు కేంద్ర మంత్రులను కలిసే అదృష్టం దక్కినందుకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది. చిన్నప్పటి నుంచీ నేను పడిన కష్టాలకు, ఒక మహిళగా స్వయంకృషితో ఎదిగి, పారిశ్రామికవేత్తగా విజయం సాధించినందుకు నాకు దక్కిన గౌరవం ఇది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

సమస్యలు నీ సంతోషాన్ని దూరం చేసే లోగా నీవే సమస్యలను దూరం చేసుకోగలగాలి

# సానుకూల మార్పులు తెచ్చిన పట్టణ పోషణ పథకం!

– ప్రగతి

ఏపిమాస్ ఆధ్వర్యంలో 'విప్రో కేర్స్' సహకారంతో మెహదీపట్నం , కార్వాన్ మున్సిపల్ సర్కిల్స్‌లో గత రెండున్నరేళ్లుగా 'పట్టణ పోషణ పథకం' విజయవంతంగా అమలు జరుగుతున్నది. ఈ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు , పిల్లల ఆరోగ్య, పోషణ అంశాలపై గృహ సందర్శనలు, తల్లుల సమావేశాలు, సామూహిక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. దీనివల్ల తల్లుల ఆరోగ్య–పోషణ పరమైన ధోరణులలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

ఈ పథకంలో స్ఫూర్తిదాయకమైన గాథలలో ఒకటి హీరానగర్‌కు చెందిన కొడుదల రాజేశ్వరి జీవన ప్రయాణం. ఆమె ఆరోగ్య కార్యకర్త భవాని మార్గదర్శకత్వంలో తన జీవితంలో ఎదురైన తీవ్రమైన సంఘటనను విజయవంతంగా అధిగమించారు.



రాజేశ్వరి జీవితంలో తొలినాళ్లలో అనేక కష్టాలు ఎదురయ్యాయి. తన భర్త వెంకటేష్‌తో వివాహం తరువాత అత్తింటి నుండి ఎటువంటి సహకారం అందకపోగా, మొదటిసారి గర్భవతి అయినప్పుడు ప్రసవంలో యిబ్బందితో బిడ్డను కోల్పోవాల్సి వచ్చింది. ఈ అనుభవం ఆమెను తీవ్రంగా కలచివేసింది. తన తదుపరి గర్భధారణను ఆరోగ్యంగా నిలబెట్టుకోవాలని దృఢనిశ్చయంతో, రెండోసారి గర్భం దాల్చగానే తన పుట్టింటికి వెళ్లి తల్లితో కలిసి ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకుంది. కూతురికి ఎదురైన పరిస్థితికి రాజేశ్వరి తల్లి కుమిలిపోయి, తన కూతుర్ని ఎంతో జాగ్రత్తగా చూసుకోసాగింది. ఐటీ కంపెనీలో హౌస్ కీపింగ్ సిబ్బందిగా పనిచేస్తున్న రాజేశ్వరి తల్లికి , తన చుట్టుపక్కల ఉన్న విద్యావంతుల కారణంగా ఆధునిక మాతృత్వ పద్ధతులపైన, గర్భ సంరక్షణపైన కొంత అవగాహన ఏర్పడింది.

ఈ సమయంలో ఏపిమాస్ ఆరోగ్య కార్యకర్త భవాని రాజేశ్వరిని ప్రాజెక్టులో భాగంగా నమోదు చేసుకుని, ఆమెకు అవసరమైన మార్గనిర్దేశం చేయడం ప్రారంభించారు. రాజేశ్వరికి రక్తహీనత, మతిమరుపు వంటి సమస్యలు ఉండటంతో భవాని ఆమెకు ఎప్పటికప్పుడు ప్రాజెక్ట్ సిబ్బంది సూచనలు మేరకు స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చారు. రక్తహీనత, పోషకాహార లోపాలను అధిగమించేందుకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల వినియోగం, బలవర్ధక ఆహార జాబితా వంటి సూచనలను రాజేశ్వరికి, ఆమె తల్లికి వివరించారు. ఆ పోషకాహారంతో రాజేశ్వరి 13 కిలోల బరువు పెరిగి, 2.78 కిలోల బరువుతో పాప జాహ్నవికి జన్మనిచ్చారు. ఆరంభంలో తల్లిపాలను అందించడంలో ఇబ్బంది పడినప్పటికీ, తన తల్లి , ఆరోగ్య కార్యకర్త భవాని ప్రోత్సాహంతో సమస్యను అధిగమించి, బిడ్డకు సక్రమంగా తల్లిపాలను అందిస్తున్నారు. ప్రస్తుతం మూడు నెలల వయస్సున్న జాహ్నవి ఆరోగ్యంగా పెరుగుతోంది.

ఇంకొక స్ఫూర్తిదాయకమైన గర్భిణి శివాజినగర్–2 ప్రాంతానికి చెందిన సిరి. గర్భిణీగా ఉన్న నాల్గవ నెలలో జరిగిన తల్లుల సమావేశానికి హాజరై ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల ప్రాముఖ్యత తెలుసుకున్న ఆమె, కుటుంబ సభ్యులు ఆ మాత్రల వినియోగం పట్ల నమ్మకం లేక వ్యతిరేకించినప్పటికి, తన భర్తను ఒప్పించి ఐరన్ మాత్రలను ఆరోగ్య కేంద్రం నుంచి తెచ్చుకుని తీసుకోవటం మొదలుపెట్టింది. నెల రోజుల చికిత్సలో ఆమె హిమోగ్లోబిన్ స్థాయి 11.0 జి/డిఎల్ నుండి 11.7 జి/డిఎల్ కి పెరిగింది.

రాజేశ్వరి, సిరి అనుసరించిన విధానాలు గర్భిణులకు సరైన మార్గదర్శనం, అవగాహనతో కష్టాలను అధిగమించడం ఎలా సాధ్యమో చాటి చెబుతాయి. తల్లులకు మార్గదర్శకంగా నిలుస్తాయి.

■

భయంతో ఎక్కడికని పారిపోతావ్ ? ఆ భయం వున్నదే నీ గుండెలో

# సేంద్రియ వ్యవసాయ టమాటా పంట క్యాలెండర్-


| పంట కార్యక్రమం | టమాట కార్యక్రమాల కాలం (రోజులలో ) |
|---|---|
| 1. నవధాన్య/పచ్చి రొట్ట సాగు వలన భూసారం పెరుగుతుంది. 45 రోజులకు పొలంలో కలియ దున్నకం వలన 8 టన్నుల పశువుల ఎరువు భూమికి వస్తుంది. ఇది భూమిలో మగ్గటానికి 15 రోజులు తీసికొంటుంది, తొందరగా మగ్గటానికి రాక్ పాస్పేట్ 100 కిలోలు దున్నక ముందు వేయడం వలన తొందరగా మగ్గుతుంది. | -60 వ రోజు |
| 2. టమోటా నారు పోసే రోజుకు 15 రోజులకు ముందు బంతి నారు పోసుకోవాలి. అనగా 25 రోజుల టమాట, 40 రోజుల బంతి మొక్కలు నాటుకోవడం వలన ఒకే సారి రెండు పూతకు వస్తాయి. బంతి, కాయ తొలిచే పురుగుకు ఎర పంటగా పనిచేస్తుంది (టమోటా16 : 1 బంతి) | బంతి -40 వ రోజు , టమోటా -25 వ రోజు |
| 3. ట్రైకోడెర్మ & సూడోమోనాస్ కల్చర్ నారు నాటడానికి 15 రోజుల ముందు తయారిచేసి, పంట చివరి దుక్కిలో చల్లటి వాతావరణంలో భూమికి వేసి దున్నుకోవాలి,దీని వలన పంటకు వచ్చే భూజు తెగుళ్ళు నియంత్రించవచ్చు. | -15 వ రోజు |
| 4 బాగా చివికిన పశువుల ఎరువు 6 టన్నులు, 01 టన్ను ఘన జీవామృతం చివరి దుక్కిలో వేసి దున్నుకోవాలి.(పిఎస్‌బి 5 కేజీలను 100 కిలోల పశువుల ఎరువుతో కలిపి చివరి దుక్కిలో చల్లడం వలన మొక్కలకు లభ్యం కాని ఫాస్పరస్ మొక్కలకు లభ్యంలోకి వస్తుంది) | -5 వ రోజు |
| 5. టమాట నారు హర్డేనింగ్ (మొక్క బయట వాతావరణంనకు అలవాటు పడటానికి) 5రోజులు చేయాలి (20 రోజుల వయస్సులో) | -5 వ రోజు |
| 6. బీజామృతం / ట్రైకోడెర్మతో నారు శుద్ధి, నాటడానికి 2 రోజుల ముందు నారు వున్న క్రేట్లకు డ్రెంచింగ్ చేయాలి. దీనివలన కాండం కుళ్ళు నివారించవచ్చు. | -2 వ రోజు |
| 7 టమాట పంటకు జొన్న/ మొక్క జొన్నకంచె పంట రెండు-మూడు వరసలు వేయాలి లేదా జొన్న నర్సరీ 15 రోజుల ముందు వేసికోవడం. | 15వ రోజు |
| 8 తయారైన ట్రైకో డెర్మ & సూడోమోనాస్ నారు నాటే చోట స్పాట్ అప్లికేషన్ చేయడం వలన చెట్లుకు వచ్చే మొక్క చనిపోవడం నివారణ అవుతుంది. | 1వ రోజు |
| 9 ప్రధాన పొలంలో టమాట నారు నాటడం & బంతి (1:16) అలసంద, ఎర పంటలు అక్కడక్కడ నాటడం. | 0 |
| 10 ప్రధాన పొలంలో మల్చింగ్ బెడ్స్ మధ్య అలసంద లేదా పొట్టు చల్లి, 35 రోజులకు మొక్కలు తీసి పరచడం వలన మల్చింగ్ (ఆచ్ఛాదన)గా మారి తేమ ఆవిరి కాకుండా ఉండటమే కాకుండా & భూమిలో సారం కుడా పెరుగుతుంది. | 1-2 రోజులు |

నిన్ను పదేపదే వేధించే వారివల్ల నీ ఆత్మబలం పెరుగుతున్నట్టు, వారి బలం క్షీణిస్తున్నట్టు

| | |
|---|---|
| 11 టమాట నాటిన 2-3 రోజులలో మొక్కజొన్న 5 నుండి 7 వరసలకు ఒక వరస ఉత్తర - దక్షిణం నాటడం వలన నీడ టమోటా చెట్లపై పడి, ఎండ వేడి తగ్గి వేసవి కాలంలో పూత రాలకుండా కాపాడుతుంది. | 2-3 రోజులలో |
| 12 టమాట నాటిన 3 రోజులలోనాటిన రెండు రోజులకు ట్రై కొడెర్మ 1 ప్యాకెట్ 200 లీటర్ల నీళ్ళలో డ్రెంచింగ్ చేయడం వలన మొక్కకు శిలీంద్రం ద్వారా వచ్చే వడలు లేదా కాండం కుళ్ళు నివారించవచ్చు. | 5 వ రోజు |
| 13 టమాట నారు నాటిన 7 రోజులకు రసం పీల్చే పురుగుల కోసం వేపగింజలకషాయం / వేప నూనె 5000 %జూజూఎ% 3 మిల్లీ లీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. | 8 వ రోజు |
| 14 టమాట నాటిన 1-5 రోజులలోగా 25 -30 జిగురు బంక అట్టలు అడుగు ఎత్తులో (20 పసుపు :10 నీలం: 10 తెలుపు) పెట్టు కోవాలి. దీని వలన రసం పీల్చే పురుగులను యాజమాన్యం చేయవచ్చు. | 1-5 వ రోజు |
| 15 టమాట నారు నాటిన 15 రోజుల వయస్సులో వావిలాకు,తుమ్మి, ఉమ్మెత్త & ఆవు మూత్రం, ఇంగువ కషాయం 1:10 పిచికారి చేసికోవాలి. దీనివలన రసం పీల్చే పురుగులు(తామర పురుగు, తెల్ల& పచ్చదోమ, నల్లపేను) నివారించవచ్చు. 1 /2 కిలో కుంకుడు కాయ రసం కలపడం వలన స్ప్రెడ్‌గా పని చేస్తుంది. | 15,30,43,57,71వ రోజులలో |
| 16 టమాట నారు నాటిన 5 రోజులలో వయస్సులో ఒక ఎకరాకు ఒక లైట్ ట్రాప్ అమర్చాలి. శత్రు పురుగుల రెక్కల పురుగు దశలను నిర్మూలించవచ్చు. | 1-5 వ రోజులలో |
| 17 టమాట నారు నాటిన 20 మరియు 80 రోజులలో నానో ఎన్‌పికే జీవన ఎరువు ఫెర్టిగేషన్ పద్దతిలో వాడకం వలన మొక్కల పెరుగుదల బాగుంటుంది. | 20&80 రోజులలో |
| 18 టమాట నారు నాటిన 20 రోజులకు సూది పురుగు(టూట) లింగాకర్షక బుట్టలు 05 ఎకరాకు పెట్టాలి | 20 వ రోజు |
| 19 టమాట నారు నాటిన 30 రోజులకు బి వి యం జీవ పురుగు మందు & వేప నూనెతో కలిపి పిచికారి చేయాలి. దీనివలన రసం పీల్చే పురుగుల& పచ్చ పురుగు తొలి దశ నివారించవచ్చు. | 22, 37, 50, 64, 80వ రోజులలో |
| 20 జీవామృతం నాటిన 20 రోజుల నుండి ప్రతి 15 రోజులకు 200 లీటర్లు వదలు కోవడం వలన భూమిలో సూక్ష్మ జీవుల చర్యలు పెరిగి మొక్కకు పోషకాహారం ఎక్కువగా అందుతుంది. పంట కాలం పెరుగుతుంది. | 20, 35, 50, 65, 80, 95, 110, 125 వ రోజులలో |
| 21 పంట బాగా ఎదిగి కాయ అభివృద్ధికి బాక్టీరియా (పికె ఎక్కువ మోతాదు) లో డ్రిప్పులోకి వదలడం వలన కాయ నాణ్యత పెరుగుతుంది. | 60 రోజులకు |
| 22 పంట అభివృద్ధి పరిస్థితిని బట్టి వేప/కానుగ మరియు శనగపిండి చెక్క నాటిన 50 రోజుల నుండి ప్రతి 15 రోజులకు ఒకసారి 50 కిలోలు ఒక డ్రమ్ములో 10-15 రోజులు నానబెట్టి, 04 కిలోల బెల్లం కలిపి డ్రిప్పులో వదలుకోవడం వలన పంట | 50, 65 / 80, 95 / 110 వ రోజులలో బాగా వచ్చి |

| | |
|---|---|
| బాగా వచ్చి దిగుబడి పెరుగుతుంది. | |
| 23కోడి గుడ్డు ద్రావకం/ చేప ద్రావకం–/పంచగవ్య–30 మిల్లిలు పూత దశలో మార్చి మార్చి 3 మిల్లీ లీటరు నీటికి కలిపి15 రోజులకు ఒకసారి పిచికారి వలన పూత ప్రేరేపితమై, బాగా పిందే కట్టి, పంట నాణ్యత పెరుగుతుంది. | 40,60,80,100,120 వ రోజులలో |
| 24 పచ్చ పురుగు / కాయ తొలిచే పురుగు నివారణకుబాసిల్లస్ తురింజెన్సిస్ (బిటి)/పచ్చి మిర్చి వెల్లుల్లి కషాయం నాటిన 50,70 రోజుల వయస్సులో పిచికారి చేసికోవాలి. | 50,70,90 వ రోజు |
| 25 టమాటలో పూత బాగా నిలువటానికి, శిలీంద్ర తెగులు నివారణకు మజ్జిగ మరియు ఇంగువ ద్రావణం పిచికారి చేయాలి. (2 లీటర్ల పెరుగు ం 200 గ్రా ఇంగువ) | 45,60,75,90వ రోజు |
| 26 వైరస్ రోగ నివారణకు ఉధృతిని బట్టి 4 లీటర్ల ఆవు పాలకు 100 లీటర్ల నీటికి కలిపి పిచికారి వలన వ్యాప్తి తగ్గుతుంది. కాంగ్రెస్ కలుపు మరియు ఇతర కలుపు మొక్కలు వైరస్ వాహకాలుగా పని చేస్తాయి,వీటిని నాశనం చేయాలి. | |
| 27 నల్లి నివారణకు 2 కిలోల వేప పేస్టు + 2 కిలోల కానుగ పేస్టు + 200 గ్రాముల ఇంగువ కలిపి 100 లీటర్ల నీటికి కలిపి పిచికారి వలన నియంత్రణ చేయవచ్చు. | పొలంలో వచ్చిన దశలో |
| 28 పంట పూర్తి అయిన వెంటనే టమాట చెట్లను పెరికి కంపోస్ట్ చేయడం వలన, ఎరువు తయారవడమే కాకుండా శిలీంధ్ర వ్యాప్తిని అరికట్టవచ్చు. | పంట కోతలు పూర్తి అయిన తరువాత |

## నిర్మల్ జిల్లా చరిత్ర ఉత్సవాలు!



– మైత్రి ప్రవీణ్

**ని**ర్మల్ జిల్లా చరిత్రను ప్రపంచానికి తెలియజేసే ఉద్దేశంతో, 2025 జనవరి 5 నుండి నిర్మల్ ఉత్సవాలు మూడు రోజులపాటు, ఉదయం 11 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు, జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగాయి. ఈ ఉత్సవాల్లో వివిధ ప్రభుత్వ శాఖలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి స్టాళ్లు ఏర్పాటు చేశాయి. ప్రతి శాఖతో సహకారం తీసుకుంటూ, ఉత్పత్తులను ప్రోత్సహించడానికి కాంటీన్లు ఏర్పాటు చేశారు. ప్రజలందరూ వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ, కుంటాల మండల సమాఖ్య తయారు చేసిన నాప్కిన్ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఇవే కాకుండా, టాయిలెట్లు , హ్యాండ్ వాష్ లిక్విడ్లు, అలాగే మహిళలు, చిన్నపిల్లల అనారోగ్య సమస్యలను పరిష్కరించడానికి పరికరాలను, వాటర్ ఫిల్టర్‌లను ప్రదర్శించారు. వాష్ కార్యక్రమాల గురించి కూడా వివరించారు. ఈ ఉత్సవాలు నిర్మల్ జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున హాజరై, ఉత్సవాలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

**అయినదానికి కానిదానికి అతిశయం చూపడం కాదు, అణకువగా మెలగడం ఆనందానికి మూలం**

# పట్టణాల్లో ఉన్న ఆస్తులు తనఖా పెడితేనే రుణం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే 50 శాతం రాయితీని అందిపుచ్చుకుని.. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్న యువత ఆశలపై బ్యాంకులు నీళ్లు చల్లుతున్నాయి. వ్యవసాయ ఆధారిత యూనిట్ల ఏర్పాటుకు రుణం కావాలంటే పట్టణాల్లోని స్థలం తనఖా పెట్టాలని సతాయిస్తున్నాయి. గ్రామాల్లో పొలాలనే నమ్ముకున్న తమకు పట్టణాల్లో స్థలాలు, ఇళ్లు ఎక్కడి నుంచి వస్తాయని మొత్తుకుంటున్నా బ్యాంకర్లు వినిపించుకోవడం లేదు. దీంతో జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) ముందుకు సాగడం లేదు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ) కింద చిన్న యూనిట్లు పెట్టాలనుకునే వారికీ ఇదే సమస్య ఎదురవుతోంది. నిబంధనలు అలా ఉన్నాయని.. భారతీయ రిజర్వ్ బ్యాంకు, కేంద్ర ఆర్థికశాఖ నుంచి ఉత్తర్వులు వస్తే వాటిని అమలు చేస్తామని బ్యాంకర్లు చెబుతున్నారు.

**1,600 దరఖాస్తుల్లో మంజూరైనవి 290**

ఎన్ఎల్ఎం కింద కోళ్ల పరిశ్రమకు గరిష్ఠంగా రూ.25 లక్షలు, గొర్రెలు, మేకల పెంపకానికి రూ.50 లక్షలు, పందుల పెంపకానికి రూ.30 లక్షలు, గడ్డి పెంపకానికి రూ.50 లక్షల వరకు రాయితీ ఇస్తారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల నుంచి రుణంగా తీసుకోవాలి. ఈ పథకం కింద మొత్తంగా 3 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. ఇందులో 1,600 దరఖాస్తులకు అర్హత ఉన్నప్పటికీ మంజూరైనవి 290 మాత్రమే.

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ (సర్ఫేసి చట్టం) ప్రకారం రూ.50 లక్షలకు పైగా రుణాలు మంజూరు చేయాలంటే వ్యవసాయేతర భూములను తనఖా పెట్టాలనే నిబంధనలున్నాయని బ్యాంకర్లు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో మేత పెంపకానికి సంబంధించిన పొలాన్ని కూడా వ్యవసాయేతర భూమిగా మార్చాలని బ్యాంకులు కోరుతుండటం విస్మయాన్ని కలిగిస్తోంది. దానిని వ్యవసాయ భూమిగా ఉంచాలని పశుసంవర్ధకశాఖ చెబుతుంటే బ్యాంకులు మాత్రం మార్పిడి చేయాల్సిందేనని స్పష్టం చేస్తున్నాయి. తనఖా ప్రక్రియలో ఎదురవుతున్న సమస్య పరిష్కారానికి రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించామని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు తెలిపారు. ■

## ప్రతి మహిళకు మెప్మాలో సభ్యత్వం

పట్టణాల్లో మహిళా సంఘాంలో చేరని మహిళలకు కొత్తగా సభ్యత్వం కల్పించడానికి మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) చర్యలు తీసుకుంటుంది. మున్సిపాలిటీల్లో నివాసం ఉంటున్న ప్రతీ మహిళకు సభ్యత్వం కల్పించేందుకు ఇటీవల రాష్ట్ర మెప్మా శాఖ ఆదేశాలు జారీ చేసింది. మున్సిపాలిటీల్లో వందల సంఖ్యలో స్వయం సహాయక మహిళా సంఘాలు ఉండగా వేల సంఖ్యలో సభ్యులు ఉన్నారు. వీరితో పాటు కొత్తగా మహిళలను సంఘంలో చేరుకోవాలని ఆదేశాలు వచ్చాయి.

మున్సిపాలిటీల్లో మెప్మా రిసోర్స్ పర్సన్‌లు, సీఓలు జనవరి చివరి వారం వరకు కొత్త వారికోసం సర్వే నిర్వహించి వారి వివరాలు ఇంటర్‌నెట్ ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. కాగా ఫిబ్రవరి మొదటి వారంలో వారితో సమావేశాలు నిర్వహించి మహిళా సంఘాలను గ్రూపులుగా విభజించనున్నారు. వారికి తోడు ఇదివరకు సంఘంలో ఉండి వెళ్లిపోయిన వారిని కూడా గుర్తించి అవగాహన పర్చడంపై ప్రయత్నాలు చేస్తున్నారు. సంఘంలో సభ్యత్వం ఇచ్చిన తర్వాత రాష్ట్ర పభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి పథకంలో రుణాలు ఇప్పించాల్సి ఉంటుంది. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని మెప్మా అధికారులు అంటున్నారు. ■

# నాగాలాండ్‌లో ఏపిమాస్ బృందం శిక్షణ

– జి.శ్రీనివాస్

**నా**గాలాండ్ రాష్ట్రంలోని 'ఈలుతోరోస్ క్రిష్టియన్ సొసైటీ' (ఈ.సి.యస్) అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి, నిర్వహిస్తున్న స్వయం సహాయ సంఘాలు, సమాఖ్యలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై గత సంవత్సరంలో ఏపిమాస్ అధ్యయనం చేసిన తరువాత, ఆ సంస్థల, సంఘాల బలోపేతం కోసం వారు ఏపిమాస్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం సహకారం అందించడంలో భాగంగా, 2025 జనవరి 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 01 వరకు ఏపిమాస్ శిక్షణల డైరెక్టర్ శ్రీ మురళి జాజున, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీ జి. శ్రీనివాస్ నాగాలాండ్ రాష్ట్రంలోని ట్వేన్సంగ్ జిల్లాలో ఈ.సి.యస్ సంస్థ నిర్వహణలోని సంఘాలు, సమాఖ్యల సభ్యులకు సంస్థల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ యివ్వడం జరిగింది.






కొండలు, గుట్టల మధ్య నివాసం ఉంటున్న ప్రజలతో ఈ.సి.యస్ సంస్థ వారు సంఘాలను ఏర్పాటు చేశారు. ఇందులో మహిళా సంఘాలు ఉన్నాయి. పురుషులతో కూడా సంఘాలు ఏర్పాటు చేశారు. ఈ సంఘాల సభ్యులు పొదుపులు చేస్తున్నారు, అప్పులు తీసుకుంటున్నారు. ఈ సంఘాలన్నీ కలిసి సమాఖ్యలను కూడా ఏర్పాటు చేసుకున్నాయి. సమాఖ్య ద్వారా అప్పులు తీసుకుంటున్నారు. పుస్తక నిర్వహణ విషయానికొస్తే , సంఘంలోని చదువుకున్న సభ్యులే పుస్తకం రాస్తున్నారు.

సందర్శనలో భాగంగా మొదటి రోజున ఆయా సంఘాల సభ్యులతో కలిసి సంఘాలలో, ఫెడరేషన్‌లో వారు చేస్తున్న కార్యక్రమాలను, పుస్తక నిర్వహణ మొదలగు అంశాలను పరిశీలించాము. రెండవ రోజు నుండి నాలుగు రోజుల పాటు 25 మంది పుస్తక నిర్వాహకులు, కమ్యూనిటీ ఆడిటర్‌లకు పుస్తక నిర్వహణ , ఆడిటింగ్‌పై ఒక బ్యాచ్‌గా, 52 మంది ఫెడరేషన్ లీడర్లకు రెండు బ్యాచ్‌లుగా సమాఖ్య నిర్వహణ, లీడర్ల బాధ్యతలు మొదలగు అంశాలపైన, మొత్తం మూడు బ్యాచ్‌లుగా శిక్షణ యిచ్చాము.

ఈ మూడు బ్యాచ్‌ల శిక్షణ తరువాత శిక్షణలో పాల్గొన్న అభ్యాసకులు మాట్లాడుతూ, శిక్షణ ఎంతగానో బాగుందని, ఎంతో ఉపయోగకరం ఉందనీ, ఇట్టి శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ సంఘాలలో అమలు అయ్యేలాగా చూస్తామని చెప్పారు. శిక్షణ ఏర్పాటు చేసిన ఈలుతోరోస్ క్రిష్టియన్ సొసైటీ వారికి, శిక్షణ ఇచ్చిన ఏపిమాస్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఈలుతోరోస్ క్రిష్టియన్ సొసైటీ (ఈ.సి.యస్), సెక్రటరీ శ్రీ డా.చింగ్ మాక్, వారి సిబ్బంది ఏపిమాస్ టీంను కలిసి వచ్చే సంవత్సరంలో ఏపిమాస్ తమకు మరింతగా సహకారం అందించాలని కోరారు.

తమ సంఘాలు, సంస్థల బలోపేతానికి సహకరిస్తున్న ఏపిమాస్‌కు ధన్యవాదాలు తెలిపారు

■

**అయినదానికి కానిదానికి అతిశయం చూపడం కాదు, అణకువగా మెలగడం ఆనందానికి మూలం**

# వాటర్ ఆర్గ్ ప్రతినిధి మెదక్ వాష్ ప్రాజెక్ట్ సందర్శన

– కే. శ్రీనివాస్

**తె**లంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలో 'మెప్మా' (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) పరిధిలోని నాలుగు మునిసిపాలిటీలలో ఏపిమాస్ ఆధ్వర్యంలో వాటర్.ఆర్గ్ సంస్థ తోడ్పాటుతో, నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించడానికి వాటర్.ఆర్గ్ ప్రతినిధి శ్రీమతి శర్మిష్ఠా మిశ్రా జనవరి 23వ తేదీన మెదక్ పట్టణానికి వచ్చి, ఏపిమాస్ ప్రతినిధులు వాష్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ శ్రీనివాస్, జిల్లా కో ఆర్డినేటర్ అనిత గారితో కలిసి మెప్మా అధికారులతో, సమాఖ్య సభ్యులతో సమావేశమయ్యారు.





మెదక్ జిల్లా మెప్మా ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ శ్రీమతి ఇందిర ఏపిమాస్ సంస్థ ద్వారా మెప్మా పరిధిలో జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలలో అమలవుతున్న వాష్ ప్రాజెక్ట్ వివరాలను ఆమెకు తెలియజేశారు. శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్ నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత గురించి స్వయం సహాయ సంఘాల సభ్యులకు కలిగిస్తున్న అవగాహన, తద్వారా వారు వారి ఇళ్ళలో చేపట్టిన నీరు, పారిశుధ్యం మెరుగుదల చర్యలను వివరించారు.

శ్రీమతి శర్మిష్ఠా మిశ్రా బృందంవారు మెదక్ పట్టణంలోని ఔరంగాబాద్ స్లం లెవల్ సమాఖ్య సభ్యులతో, వివిధ సంఘాల సభ్యులతో సమావేశమై చర్చించారు. ఆ సమావేశంలో సమాఖ్య రిసోర్స్ పర్సన్, సభ్యులు వాష్ ప్రాజెక్ట్ వల్ల తాము నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతలపై ఏ విధంగా అవగాహన పెంపొందించుకున్నదీ తెలియజేశారు. తమ కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయాలపై అవగాహన కలిగించి, వారు కూడా వాష్‌కు సంబంధించిన మంచి అలవాట్లు పాటించేటట్లు చేస్తున్నట్టు వివరించారు.

ఈ బృందం వాష్ రుణాలు తీసుకున్న స్వయం సహాయ సంఘ సభ్యుల గృహాలను సందర్శించి, వారితో మాట్లాడారు. ఆ సభ్యులు తాము తమ స్వయం సహాయ సంఘంలో తీసుకున్న రుణాలతో తమ ఇండ్లలోని నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతలను ఏవిధం గా మెరుగు పరుచుకున్నదీ తెలియజేశారు. వారి ఇళ్ళల్లో బోరు పంపులు, నీటి పైపులు, నీటి టాంకులు, మరుగుదొడ్లు మొదలైన సదుపాయాలు ఏవిధంగా మెరుగుపడినదీ పరిశీలించారు. వారి కుటుంబ సభ్యులకు ఆ సదుపాయాలు ఏ విధంగా ఉపయోగ పడుతున్నదీ వారిని అడిగి ఆమె తెలుసుకున్నారు.

సందర్శనలో భాగంగా అయిదుగురు స్వయం సహాయ సంఘ సభ్యులతో నడప బడుతున్న శ్రీ శివ గంగాభవాని వాటర్ ప్లాంట్‌ను బృందం పరిశీలించింది. ఆ ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలతో మాట్లాడి, వారిని ఆమె అభినందించారు. వాటర్ ప్లాంట్ ద్వారా ఎల్లప్పుడూ నాణ్యమైన సురక్షిత మంచినీటిని ప్రజలకు అందించాల్సినదిగా వారికి సూచించారు.

మెదక్ జిల్లాలో ఏపిమాస్ ఆధ్వర్యంలో వాష్ ప్రాజెక్ట్ అమలు తీరుపట్ల శ్రీమతి శర్మిష్ఠా మిశ్రా సంతృప్తి వ్యక్తం చేశారు. మెప్మా జిల్లా అధికారులతో, ఇతర సిబ్బందితో ప్రాజెక్టుపరంగా సత్సంబంధాలను సాగిస్తున్న ప్రాజెక్ట్ జిల్లా కో ఆర్డినేటర్ అనితను అభినందించి, ఇదే స్ఫూర్తితో ప్రాజెక్ట్ కార్యాచరణను మరింత మెరుపరచాలని సూచించారు. ■

అవే అవకాశాలు ...వ్యక్తిత్వాన్ని మెరుగుపరచుకోవడానికైనా, దిగజార్చుకోవడానికైనా

# తిరుపతిలో పాలేకర్ వ్యవసాయ శిక్షణ శిబిరం

– డాక్టర్.భార్గవి

తిరుపతి శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ఆధ్వర్యంలో జనవరి 28వ తేదీన పద్మశ్రీ సుభాష్ పాలేకర్ గారిచే ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రైతులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరంలో మొత్తం 800 నుంచి 900 మంది రైతులు పాల్గొన్నారు. ఏపిమాస్ నుంచి 100 మంది రైతులు, 10 మంది సిబ్బంది పాల్గొన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో పీలేరు, కలికిరి, కలకడ, వాయల్పాడు, గుర్రంకొండ, పెద్దమాండ్యం నుంచి మరో 30 మంది రైతులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

సుభాష్ పాలేకర్ గారి దృక్పథం ప్రకారం, గ్లోబల్ వార్మింగ్ , క్లైమేట్ ఛేంజ్ వ్యవసాయంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. దీనికి పరిష్కారం ప్రకృతితో అనుసంధాన మైన వ్యవసాయ విధానాల్లోనే ఉందని ఆయన నమ్మకం.

**1. రసాయనికాలే ప్రధాన కారణం**

- పాలేకర్ అభిప్రాయం ప్రకారం, హరిత విప్లవం తరువాత విస్తృతంగా ఉపయోగిస్తున్న రసాయనిక ఎరువులు, పురుగు మందులు మట్టిని నాశనం చేస్తున్నాయి.
- ఇవి ప్రకృతి సమతుల్యతను దెబ్బతీసి గాలి మరియు నీటి కాలుష్యానికి దారి తీస్తున్నాయి.

**2. క్లైమేట్ ఛేంజ్ – వ్యవసాయంపై ప్రభావం**

- వాతావరణ మార్పుల వల్ల అనిశ్చిత వర్షపాతం, ఎండ తీవ్రత, వరదలు మరియు కరువు వంటి సమస్యలు పెరిగిపోతున్నాయి.
- దీనివల్ల రైతులు భారీగా నష్టపోతున్నారు. ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రములైన ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో ఇవి మరింత ప్రభావం చూపుతున్నాయి.

**3. సహజ వ్యవసాయమే పరిష్కారం**

- ఆయన రూపొందించిన వ్యవసాయ పద్ధతులు వాతావరణ మార్పులను తట్టుకునేలా ఉంటాయి.
- వృక్ష జీవామృతం, మల్చింగ్, సహజ విత్తనాలు ఉపయోగించడం వల్ల భూమి స్వతంత్రంగా పర్యావరణానికి అనుగుణంగా ఉంటుంది.

**4. ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలు**

- గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు మట్టిలోని సూక్ష్మ జీవాలను పెంచుతుంది.
- తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ దిగుబడి అందించేలా వ్యవసాయ విధానం అభివృద్ధి చేయొచ్చు.

**తెలుగు రాష్ట్రాల రైతులకు సందేశం**

- రైతులు రసాయనిక పద్ధతులను వదిలిపెట్టి, సంప్రదాయ ప్రకృతి వ్యవసాయాన్ని అవలంభించాలి.
- ప్రస్తుత వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు స్థానిక విత్తనాలను ప్రోత్సహించి, మట్టిని పునరుద్ధరించేందుకు సహజ శైలి పాటించాలి.

**గ్లోబల్ వార్మింగ్ ఎలా జరుగుతోంది?**

ప్రస్తుత వ్యవసాయ విధానాలు గ్లోబల్ వార్మింగ్‌ను తీవ్రతరం చేస్తున్నాయి. రసాయనిక ఎరువులు, ట్రాక్టర్లు, నీటి దుర్వినియోగం, మట్టి నాశనం మొదలైనవి వాయుగుండానికి హాని కలిగిస్తూ ఉష్ణోగ్రతలు పెరగడానికి దోహదం చేస్తున్నాయి.

**1.గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు**

- యూరియా, డిఏపి, పోటాష్ వంటి రసాయన ఎరువులు ఉపయోగించడం వల్ల నైట్రస్ ఆక్సైడ్ అనే హానికరమైన వాయువు విడుదలవుతుంది.
- ఈ వాయువు గ్లోబల్ వార్మింగ్‌కు కార్బన్ డై ఆక్సైడ్ కంటే 300 రెట్లు ఎక్కువ హానికరం.
- గాలి మరియు నీటిని కాలుష్యమయం చేసి, భూమికి అధిక ఉష్ణోగ్రతను కలిగిస్తుంది.

**2. మెథేన్ ఉద్గారాలు**

- వరి భూములలో అధిక నీటి నిల్వ వల్ల మెథేన్ ($CH_4$) వాయువు ఎక్కువగా విడుదల అవుతుంది.
- మెథేన్ కూడా గ్రీన్‌హౌస్ వాయువుల ప్రభావాన్ని పెంచి, వాతావరణ మార్పులకు దారితీస్తుంది.
- అదనంగా, పశువుల పెంపకంలో జీర్ణవ్యవస్థలో కలిగే ఫెర్మెంటేషన్ ద్వారా కూడా మెథేన్ ఉద్గారాలు ఎక్కువవుతాయి.

**3. వ్యవసాయ యంత్రాల వల్ల కార్బన్ డై ఆక్సైడ్**

- వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్లు డీజిల్, పెట్రోల్ వాడడం వల్ల అధికంగా కార్బన్ డై ఆక్సైడ్ విడుదలవుతుంది
- ఇది వాయుగుండంలో ఉష్ణోగ్రత పెరిగేందుకు ప్రధాన కారణంగా మారుతోంది.

**4. వనరుల వినియోగం మట్టినాశనం**

- అధిక ఎరువులు వాడటం వల్ల మట్టిలోని సూక్ష్మజీవులు నాశనంఅవుతాయి. ఇది నేల ఫర్టిలిటీని తగ్గిస్తుంది.
- అధిక సాగు కోసం చెట్లను నరికి వేయడంవల్ల కార్బన్ శోషణ చేసే అటవీ ప్రాంతాలు తగ్గిపోతున్నాయి.
- అడవులు నష్టపోవడం వలన కార్బన్ డై ఆక్సైడ్ స్థాయి పెరిగి గ్లోబల్ వార్మింగ్‌ను పెంచుతుంది.

**5. నీటి దుర్వినియోగం & ఎరువుల వల్ల నీటి కాలుష్యం**

- అధిక నీటి వినియోగంతో భూగర్భ జలాలు తగ్గిపోతాయి. ఇది ఎండ కాలాల్లో మరింత తీవ్ర వాతావరణ మార్పులకు దారితీస్తుంది.
- నదులు, సరస్సులు మరియు నీటి వనరులు రసాయనిక ఎరువుల వల్ల కాలుష్యం చెందుతున్నాయి. ఇది సమగ్ర పర్యావరణ సమతుల్యతను దెబ్బ తీస్తోంది.

**సామగ్రిక ప్రభావం:** ఈ వ్యవసాయ విధానాల వల్ల వాతావరణ మార్పులు మరింత వేగంగా జరుగుతున్నాయి. దీని ప్రభావం:

- ఉష్ణోగ్రత పెరుగుదల
- వర్షపాతం అనిశ్చితంగా మారడం
- వరదలు, కరువు సమస్యలు పెరగడం
- భూమి నాశనం, పంట దిగుబడి తగ్గిపోవడం

**పరిష్కార మార్గాలు :** సుభాష్ పాలేకర్ గారి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా స్థానిక విత్తనాల వాడకం ద్వారా భూమిని, వాతావరణాన్ని కాపాడుకోవచ్చు.

**నాసిక్‌లో సుభాష్ పాలేకర్ మోడల్ (ఎస్ పి కె)**

మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతం వైన్యం (ద్రాక్ష తోటలు), ఇతర హార్టికల్చర్ (పండ్ల తోటలు) ఉత్పత్తులకు ప్రసిద్ధి చెందింది. కానీ, అధిక రసాయన ఎరువుల వినియోగం కారణంగా మట్టికి కలిగే నష్టం, పెరిగిన పెట్టుబడులు, సాగులో తక్కువ లాభాల వల్ల అక్కడి రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సుభాష్ పాలేకర్ మోడల్ అక్కడి రైతులకు పరిష్కార మార్గంగా మారింది.

సుభాష్ పాలేకర్ మోడల్‌లో ప్రకృతి వ్యవసాయాన్ని పూర్తిగా రసాయన రహితంగా చేయడం ప్రధాన లక్ష్యం. నాసిక్ జిల్లాలోని అనేకమంది రైతులు ఈ విధానాన్ని అనుసరించడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకుని, ఎక్కువ దిగుబడిని సాధిస్తున్నారు.

**నాసిక్ మోడల్ ముఖ్యాంశాలు**

1. జీవామృతం ద్వారా నేల సారాన్ని పెంచడం
2. బీజామృతం ద్వారా ఆరోగ్యకరమైన విత్తన ఉత్పత్తి
3. ఆచ్ఛాదనం (మల్చింగ్) ద్వారా తేమను నిల్వచేయడం
4. మిశ్రమ సాగు ద్వారా తక్కువ ఖర్చుతో అధిక లాభం

సుభాష్ పాలేకర్ గారి ప్రకృతి వ్యవసాయ విధానం గ్లోబల్ వార్మింగ్, క్లైమేట్ ఛేంజ్ వంటి సమస్యలను తగ్గించడమే కాకుండా, రైతుల ఆర్థికస్థితిని మెరుగు పరచడానికి ఉపకరిస్తుంది. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకర మైన పర్యావరణాన్ని అందించగలుగుతుంది. కార్యక్రమం చివరిలో ఏపిమాస్, వ్యవసాయ ఉత్పత్తిదారు సంఘాల బోర్డు సుభాష్ పాలేకర్ గారిని సత్కరించారు. ■

ప్రశాంతత మనసులో వుండాలి, చుట్టూ వుండడం కాదు

# 17 ఏళ్ళకే ఏడు పర్వతాలను అధిరోహించిన కామ్య!

**'అ**ధిరోహించిన ప్రతి శిఖరం ఏదో ఒకటి నేర్పుతుంది' అంటారు ప్రయాణ ప్రేమికుడు, ప్రఖ్యాత పర్వతారోహకుడు సర్ మార్టిన్ కాన్వే. అది నిజమేనని, చిన్న వయసులోనే శిఖరాల ద్వారా ఎన్నో విషయాలను తాను నేర్చుకున్నానంటుంది విశాఖ పట్నానికి చెందిన కామ్య కార్తికేయన్.





పదహారేళ్లకే ఎవరెస్ట్ అధి రోహించి రికార్డ్ సృష్టించిన ఈ బాలిక తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ను అధిరోహించి, 17 ఏళ్ళకే ఏడు శిఖరాలను అధిరోహించిన 'అత్యంత చిన్న వయస్కురాలి'గా రికార్డు సృష్టించింది!

**ఇలా మొదలైంది...**

కామ్య నాన్న, అమ్మ కార్తికేయన్, లావణ్య దంపతులకు సాహస యాత్రలు ఇష్టం. తమ చిన్నారి కామ్యను భుజాలపై మోసుకుంటూనే శిఖరాల ఆరోహణకు వెళుతుండేవారు. అలా పర్వత శిఖరాలతో చిన్న వయసులోనే కామ్యకు పరిచయం అయింది. మూడేళ్ల వయసులోనే ముంబై సమీపంలోని లోనావాలాలో తండ్రితో పాటు ట్రెక్కింగ్‌లో పాల్గొని 'శభాష్' అనిపించుకుంది. మహారాష్ట్రలోని డ్యూక్స్ నోస్, రాజ్ద్ పర్వతాలను నాలుగేళ్ల వయసులో తల్లిదండ్రులతో పాటు అధిరోహించింది.

**తల్లికి తగిన తనయ...**

హిమాలయాల ట్రెక్కింగ్‌కు తల్లితో పాటు వెళ్లింది కామ్య. అప్పుడు ఆమె వయసు ఏడేళ్లు. తల్లీ కూతుళ్లు మొదటి ప్రయత్నంలోనే 12 వేల అడుగుల ఎత్తైన చంద్రశీల పర్వతా రోహణ చేశారు. ఆ తర్వాత హిమాలయ పర్వత శ్రేణుల్లో ఒకటైన 13,500 అడుగుల ఎత్తైన హర్కిదమ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. అది పూర్తి చేసిన కొద్ది రోజుల్లోనే 13,500 అడుగుల ఎత్తైన కేదార్కంఠ పర్వతా రోహణ చేశారు. తొమ్మిదేళ్ల వయసులో హిమాలయాల్లో రూప్కుండ్ ట్రెక్కింగ్ చేసి రికార్డు సృష్టించింది కామ్య.

**మన్ కీ బాత్ లో ప్రధాని ప్రశంస !**

'అవరోధాల్ని అధిగమించి మన ఖ్యాతిని ఖండాంత రాల్లో ఇనుమడింపజేయాలి అనుకునేవారికి విశాఖ నగరానికి చెందిన కామ్య కార్తికేయన్ అనే చిన్నారి స్ఫూర్తి నిచ్చింది' అంటూ ప్రధాని శ్రీ నరేంద్రమోదీ కామ్యను ప్రశంసించారు. దక్షిణ అమెరికాలోని అత్యంత ఎత్తైన అకాన్కాగువా పర్వతాన్ని అధిరోహించిన సమయంలో మన్ కీ బాత్ లో కామ్య ప్రస్తావన తీసుకువచ్చారు మోదీ.

**ఏడు ఖండాల్లో ఎన్నో రికార్డులు!**

దక్షిణ అమెరికాలో 22,837 అడుగుల ఎత్తైన మౌంట్ అకాన్కాగువాని అధిరోహించి ఈ శిఖరాన్ని అధిరోహించిన తొలి బాలికగా ప్రపంచ రికార్డు సృష్టించింది. ఆఫ్రికా ఖండంలో అత్యంత ఎత్తైన 18,652 అడుగుల మౌంట్ కిలిమంజారోపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించి ఈ శిఖర యాత్ర పూర్తి చేయించడం ద్వారా ఆసియాలోనే అతి పిన్న వయస్కురాలిగా రికార్డు.

సరైన నిర్ణయం ఆత్మవిశ్వాసాన్ని పెంచితే, తప్పుడు నిర్ణయం అనుభవాన్ని పెంచుతుంది ; రెండూ మంచితే

యూరప్ ఖండంలోని అత్యంత ఎత్తైన 18,510 అడుగుల మౌంట్ ఎల్బ్రస్ని అధిరోహించి 'యంగెస్ట్ గర్ల్ ఇన్ ది వరల్డ్'గా రికార్డు ఆస్ట్రేలియా ఖండంలోని అతి ఎత్తైన మౌంట్ కాజియాస్కోని అధిరోహించిన రెండో బాలికగా రికార్డు యూరప్ ఖండంలోని అత్యంత ఎత్తైన 18,510 అడుగుల మౌంట్ ఎల్బ్రస్ని అధిరోహించి "యంగెస్ట్ గర్ల్ ఇన్ ది వరల్డ్"గా రికార్డు ఆస్ట్రేలియా ఖండంలోని అతి ఎత్తైన మౌంట్ కాజియాస్కోని అధిరోహించిన రెండో బాలికగా రికార్డు ఉత్తర అమెరికాలోని 20,308 అడుగుల మౌంట్ డెనలీని అధిరోహించిన యంగెస్ట్ నాన్ అమెరికన్ రికార్డు. ఆసియా ఖండంలో అత్యంత ఎత్తైన 29,031 అడుగుల మౌంట్ ఎవరెస్ట్ని అధిరోహించి నేపాల్ వైపు నుంచి ఎవరెస్ట్ని అధిరోహించిన ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా, తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సెన్ను అధిరోహించి, ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా రికార్డ్ సృష్టించింది.

**ఆల్ రౌండర్**

ముంబై నేవీ స్కూల్లో ప్లస్ టు చదువుతున్న కామ్య కార్తికేయన్ పర్వతారోహణలోనే కాదు చదువులోనూ ప్రతిభ కనబరుస్తోంది. ప్రతి పరీక్షలోనూ ఫస్ట్ గ్రేడ్ సాధిస్తోంది. సంగీతంలోనూ ప్రావీణ్యం పొందిన కామ్య పియానో వాయిద్యానికి సంబంధించి 3 గ్రేడులు పాసైంది. కర్ణాటక సంగీతం, భరతనాట్యంలోనూ 'ఆహా' అనిపించేలా ప్రతిభ చూపుతోంది.

'ప్రతి అడుగూ సవాల్గా స్వీకరించాను. సెవెన్ సమ్మిట్స్ (ఏడు శిఖరాలు)పూర్తిచేసి భారత త్రివర్ణపతాకాన్ని ఏడు ఖండాల్లోనూ రెపరెపలాడించాలన్నదే అమ్మా, నాన్నల కల. వారి ఆకాంక్ష నెరవేర్చినందుకు గర్వంగా ఉంది. ఒకానొక సమయంలో మా పేరెంట్స్ తమ సంపాదనంతా నా మీదే ఖర్చు చేశారు. కొందరు దాతలు సహకారం అందించి నన్ను ముందుకు నడిపించారు. ఎంతటి కష్టాన్నైనా అవలీలగా ఎదుర్కోవాలన్నది నాన్న దగ్గర నేర్చుకున్నాను.

(సాక్షి సౌజన్యంతో ...)

■

## మామిడి రైతులకు సూచనలు

ఈ సంవత్సరం మామిడి పూత సరైన సమయానికే వచ్చింది. బంగనపల్లి వంటి ఆలస్యమైన రకాలు కూడా ఇప్పుడు పూయడం ప్రారంభించాయి.

**జాగ్రత్త వహించాల్సిన అంశాలు**

మట్టిలోని తేమ, మట్టిరకం ఆధారంగా ప్రతి 15 రోజులకు ఒకసారినీటి పారుదల కొనసాగించండి.

**డ్రిప్ ఉన్నవారు**

- ప్రతి మామిడి చెట్టుకు నాలుగు నుండి ఐదు డ్రిప్పర్లు ఏర్పాటు చేయవలెను.
- మామిడి చెట్టు మానుకు 1 నుండి 1.5 మీటర్ల దూరంలో డ్రిప్పు ఏర్పాటు చేయవలెను.
- ఫిబ్రవరి, మార్చి మాసంలో రోజుకి మూడు గంటలు డ్రిప్ ద్వారా నీరు ఇవ్వవలెను.
- ఏప్రిల్ మాసంలో రోజుకు రెండు గంటలు మాత్రమే డ్రిప్ ద్వారా నీరు ఇవ్వవలెను.– ఏప్రిల్ మాసం చివరి రోజులలో నీటి తడి ఆపవలెను.

ప్రస్తుతం ఉష్ణోగ్రత పెరుగుతున్న కొద్దీ పౌడరీ మిల్డ్యూ ప్రమాదం ఉండే అవకాశం ఉంది. దానిని నియంత్రించేందుకు వెట్టబుల్ సల్ఫర్ 3 గ్రాములు ఒక లీటర్ నీటికి, లేదా హెక్సాకోనజోల్ 1 మిల్లీ లీటర్ ఒక లీటర్ నీటికి, జల్లుగా పిచికారీ చేయండి.ఇదే సమయంలో తేనె మంచు పురుగు బెడద కూడా అధికంగా ఉంటుంది.

ఒక పానికల్పై ( పూ గుత్తి) 4 కంటే తక్కువ హాపర్లు ఉంటే, వేప నూనె 5 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయండి.

**పూత , పండ్లు రాలుట**

పూత లేదా పండ్లు రాలిపోకుండా ఉండేందుకు, ఫలదీకరణ దశలో ప్లానోఫిక్స్ 1 మిల్లీ లీటర్ 4.5 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయండి.

■

చిత్తశుద్ధి అంటే ఎవ్వరూ నిన్ను గమనించకపోయినా సరైన రీతిలో ప్రవర్తించడమే

# పదినిమిషాల్లో ఎకరం పని పూర్తి !



*వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. ఆధునికత వైపు అడుగులేస్తోంది. పంటల సస్యరక్షణ చర్యల్లో డ్రోన్ల వినియోగం అందుబాటులోకి వచ్చింది. కొద్ది సమయంలో, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితం కనిపిస్తోంది. పది నిమిషాల్లో ఒక ఎకరం పిచికారీ చేస్తున్నారు. దీనిపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ పాటికే కొందరు రైతులు ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు.*

ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం వెంగలరెడ్డిపల్లికి చెందిన పార్శ్య రామలింగస్వామి 3.5 ఎకరాల్లో మిర్చి, పప్పుశనగ సాగు చేశారు. ఆలస్యంలేకుండా పురుగుమందు పిచికారీ చేయాల్సి రావడంతో డ్రోన్ నిర్వాహకులను సంప్రదించారు. డ్రోన్ తో 40 నిమిషాల్లో మూడున్నర ఎకరా పొలంలో పిచికారీ పూర్తి చేశారు. మొత్తం అయిన ఖర్చు 500 రూపాయలు!

వెంగలరెడ్డిపల్లికి చెందిన మరో రైతు ఎడమకంటి రంగస్వామి రెడ్డి 5 ఎకరాల్లో మిర్చి, పప్పుశనగ సాగు చేశారు. మందు పిచికారికి 55 నిమిషాల్లోనే డ్రోన్‌తో పిచికారీ చేయించారు.

పొలం వేర్వేరు చోట్ల ఉండటంతో రూ.700 తీసుకున్నారు. ఇదే కూలీలతో అయితే రూ. 2500 ఖర్చయ్యేది.

డ్రోన్ల టెక్నాలజీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వ్యవసాయ క్షేత్రంలో కూలీల కొరతను అధిగమించి సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. ఎకరాకు పురుగుల మందు పిచికారీ చేయడానికి కూలీల ఖర్చు సుమారు రూ.1000 అవుతోంది. అదే డ్రోన్లతో అయితే ఎకరాకు రూ.500 అద్దెగా తీసుకుంటారు. డ్రోన్‌లను వినియోగించి, ఏ సమయంలోనైనా, ఏ పంటకైనా సులభంగా పిచికారీ చేసుకోవచ్చు. డ్రోన్లతో అన్ని రకాల పురుగు, కలుపు మందులు, ఆర్గానిక్ ద్రావణాలు, నీటిలో కరిగే ఎరువులను పిచికారీ చేయవచ్చు. కేవలం 6 గంటల్లో 30 ఎకరాల వంటలకు పిచికారీ చేయవచ్చని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. ఎకరం పొలానికి కూలీలతో పురుగు మందులు పిచికారి చేయాలంటే 200 లీటర్ల నీరు అవసరం. డ్రోన్ల ద్వారా కేవలం 10 నుంచి 14 లీటర్ల నీరు మాత్రమే సరిపోతుంది. ఏ పంట మీదైనా 2,3 అడుగుల ఎత్తులో పొలమంతా సమానంగా పిచికారీ చేయడం డ్రోన్లతోనే సాధ్యమవుతోంది. పిచికారీతో 86 శాతం నీటిని, 95శాతం సమయాన్ని 40 శాతం మందు ద్రవాన్ని డ్రోన్ ఆదా చేస్తోంది.

**డ్రోన్ల వినియోగంపై శిక్షణ**

డ్రోన్ల వినియోగంపై యువతకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా శిక్షణ ఇస్తోంది. డ్రోన్ల వినియోగం, ఎరువులు, పురుగు మందులు ఎలా పిచికారీ చేయాలి. డ్రోన్ల విడిభాగాలు ఎలా అమర్చాలి అనే దానిపై పూర్తిస్థాయిలో శిక్షణనిచ్చి ఉపాధి కల్పిస్తున్నది. గిద్దలూరు ప్రాంతంలో గడిచిన కొద్ది రోజులుగా రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఒక రైతు ఎక్కువ భాగం డ్రోన్ల సహాయంతో తమ పంట పొలంలో మందులను పిచికారీ చేస్తున్నాడు.

**డ్రోన్ వినియోగం పెరిగింది**

సాంకేతికత పెరగడంతో డ్రోన్ లను వ్యవసాయానికి వినియోగిస్తున్నాడు. సాంకేతికతను అందిపుచ్చేందుకు శిక్షణ పొందాం. ప్రస్తుతం వ్యవసాయరంగంలో అన్నిటా డ్రోన్‌ల వినియోగం పెరిగింది.

***– బి. సోమేశ్వర్, ఆపరేషన్ మేనేజర్***

■

**కోరుకున్నట్టు జీవితం నడవకపోవచ్చు , కాని జీవించే అనుక్షణం ఉదాత్తంగా నడవగలిగితే చాలు**

# జీవనోపాధుల బలోపేతం

ప్రత్యామ్నాయ పంటల సాగు పద్ధతులు...
చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ మార్గాలు

## చేపట్టే పనులు

డైరీఫాం, పౌల్ట్రి




పందిళ్ళపై కూరగాయల సాగు



బహుళ పంటల సాగు







పెరట్లో కూరగాయల పెంపకం



చిరు ధాన్యాల సాగు



చిరు ధాన్యాల ప్రాసెసింగ్

NABARD

MAHILA SADHIKARATHA
Publication Date: 01-02-2025 ; Posting Date: 05 & 06-02-2025
RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2024-26



ఏపిమాస్‌చే గణతంత్ర దినోత్సవం




ఏపిమాస్ కార్యాలయంలో పాలేకర్ కృషి (ఎస్ పి కె) సదస్సు ... మరికొన్ని దృశ్యాలు



'భారత్ గ్రామీణ్ మహోత్సవం' లో 'వికసిత భారత్ కోసం సహకార సంస్థలకు సాధికారత' చర్చాగోష్ఠిలో శ్రీ సి ఎస్ రెడ్డి, శ్రీ మోహనయ్య ప్రభృతులు




తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఎఫ్ పి ఓల సభ్య రైతులకు శ్రీ సుభాష్ పాలేకర్ శిక్షణ శిబిరం



కుండల తయారీ శిక్షణ ... సర్టిఫికేట్ల పంపిణీ



బీహార్‌లో పుట్టగొడుగుల పెంపకంపై ఏపిమాస్ శిక్షణ

To ADDRESS



ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసులు
పెద్దతిప్పసముద్రం ఎఫ్ పి ఓ సందర్శన

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి
ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089